



ప్రభువగు యెహోవాయే నాకు బలము

# HANNA KRUPA

సంపుటి : 6 A Christian Devotional Monthly Magazine సంచిక : 10

Founder :
Kodavatikanti Emmanuel Rajendra, B.A.,B.L.,

Editor :
Nathaniel R. Kodavatikanti, B.Th.,M.A.,(M.Phil)


## విషయసూచిక


| | | |
|---|---|---|
| నా కుటుంబము... | ఛీఫ్ ఎడిటర్ | 3 |
| బ్రాహ్మణ పూజారి..... | పరవస్తు | 4 |
| యజ్ఞము... | కీ॥శే॥ పండిట్ సి.హెచ్. ఫ్రాన్సిస్ | 6 |
| రక్షణకార్యము | శ్రీ జడ్. సి. దేవదానం, కర్నూలు | 8 |
| అపొస్తలుడైన ఎబినెజరు | అనువాదం : యస్.ఎ.టి.ఆర్.ప్రసాద్ | 10 |
| మహాయజ్ఞము | రెవ.డా॥బి.శాంసన్,చెన్నై, రెవ.డా॥ పి.జె.పంచరత్నం, నంద్యాల | 12 |
| మదర్ తెరీసా | యడవల్లి ప్రసాదరావు, హైదరాబాద్ | 14 |
| విశ్వాసంలో ఓ మెట్టు | కొడవటికంటి | 16 |
| మార్చి నెల ప్రశ్న | హన్నాకృప డెస్క్ | 18 |
| ప్రభువు కృపవలన | కొడవటికంటి సాక్ష్యము | 19 |
| బ్రదర్ భక్తసింగ్ | డా॥ పి. చంద్రశేఖరరావు | 20 |
| కనువిప్పు | బొకినాల ఇశ్రాయేలు, విజయవాడ | 23 |
| సాక్ష్యము | రత్నకుమారి, ఇబ్రహీంపట్నం | 25 |
| బైబిలు జ్ఞానము | హన్నాకృప డెస్క్ | 26 |
| శూన్యంనుండి పదార్థం... | హన్నాకృప డెస్క్ | 27 |
| సువార్తలలోని యేసు కథ | కొడవటికంటి | 28 |
| ప్రయాణంలో మజిలీ | హన్నాకృప డెస్క్ | 29 |
| News | Desk | 31 |



**చిరునామా :**

ఎడిటర్, హన్నాకృప,

54-1-23 (A), కృపాదానంవీధి, క్లోపేట, 6వ లైను, ఒంగోలు- 1.



Hon. Editor :
**A.N.R. Zakkam**
D.G.M., SOMA Enterprises, Rajasthan

Hon. Advisor :
**Yadavalli Prasada Rao**
D.A.O.,G.H.M.C., Hyderabad

Patrons :
**Dr. Y.S. Purushottam Reddy**
Superintendent, Rajareddy Hospital
Pulivendula

**Rev. Dr. K. Joseph**
Director, I.E.R.F. Ongole

**Rev. Dr. M.S. Santhavardhan**
Director, Good News Messenger, Guntur


**చందా వివరములు:**

సంవత్సర చందా : రు. 150-00
జీవిత చందా : రు. 3000-00
పోషక చందా : రు. 5000-00

ఆన్‌లైన్ అకౌంట్ నెం. : 10957294362
బ్రాంచి నెం. : 0890
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
కె. సామ్యేల్ రాజేంద్ర
6వలైను, క్లోపేట, ఒంగోలు

సంపాదకీయం

# నా కుటుంబము

యడవల్లి ప్రసాదరావుగారు మదర్ థెరిస్సా జీవితాన్ని పరిశోధించి వ్రాసిన పుస్తకములో ఆమె తన తల్లిదండ్రులు వేసిన పునాది మీద కట్టబడినది అని వ్రాశారు. ఆమె తండ్రి తన ముగ్గురు పిల్లలతో చెప్పినదేమిటంటే “మీరు బయట ప్రపంచములో తిరిగేటప్పుడు మీరు ఎవరి పిల్లలో మరచి పోవద్దు. మన కుటుంబ గౌరవాన్ని భంగపరచేలా ఉండ కూడదు” అని బోధించాడు.

ఒకరోజు ఒక ఆఫీసర్‌తో మాట్లాడటానికి మా తండ్రిగారితో కలసి ఆఫీసుకి వెళ్ళాను. చాలా అవసరమైన విషయం మాట్లాడాలి. పది గంటలకు రావల్సిన ఆయన పదిన్నరకి వచ్చాడు. రాగానే మా తండ్రిగారిని ప్రేమగా పలకరిస్తూ ‘ఏం పనిమీద వచ్చారు’ అని అన్నాడు. మా తండ్రిగారు ‘ఏమీలేదు, ఊరికే చూసివెళ్దామని వచ్చాను’ అని చెప్పి రెండు మాటలు మాట్లాడి బయటకు వచ్చాము. ‘అదేంటి నాయనా ఏమి పనిలేదు అని ఆయనతో అన్నావు’ అన్నాను.

అందుకు మా తండ్రి ‘ఆయన ఇంటి దగ్గర నుండి సమాధానముగా రాలేదు, ఇప్పుడు ఆయనతో ఏ విషయం మాట్లాడినా సరైన స్పందనరాదు’ అన్నాడు. ‘మీకెలా తెలుసు’ అన్నాను. ‘ఆయన పైకి నవ్వినా, ఆయన హృదయం నెమ్మదిగా లేదు’ అన్నాడు.

కుటుంబములోని ఏ వ్యక్తి అయినా వయసుతో సంబంధం లేకుండా తన కుటుంబాన్ని బయట ప్రపంచానికి చూపిస్తాడు. యేసుప్రభువు ఈ లోకానికి వస్తూ సమాధానమును తీసికొని వచ్చాడు. ఆయనకిష్టులైన వారికి భూమి మీద సమాధానం. ఒక కుటుంబములో ఏ ఒక్క వ్యక్తి ద్వారాగాని ఆ కుటుంబము యొక్క సమాధానము మాయమవుతుంది. కనుక అసమాధానంగా ఉన్న వాని కొరకు కుటుంబములోని వారందరు ప్రార్థిస్తే చాలును. ఎప్పుడైతే ఒక వ్యక్తి కొరకు మనం ప్రార్థించటం మొదలు పెడతామో, మనం అతని ప్రేమించడం మొదలుపెడతాము. ప్రేమకు వున్న బలమైన శక్తి ఆ వ్యక్తిని మార్చివేయగలదు.

ప్రభువు సేవలో గొప్ప విజయము సాధించిన కుద్దూస్ గారి ఇంటికి చాలాకాలం తర్వాత చూడటానికి వెళ్ళాను. చాలాసేపు మాట్లాడిన తర్వాత ఆయన భార్య పద్మ నాతో ‘అన్నా, నేను ఆయనతో సేవకు వెళ్ళను, పాటలు పాడను, సంఘంలో ఏ పనిచేయను కాని నా భర్త ఇంటిలో ఉన్నప్పుడు కాని, సేవకు వెళ్ళేటప్పుడు కాని ఆయన సమాధానంగా వుండేటట్లు చూస్తాను. ఆయన ఇంటికి తెచ్చే వారెంతమంది అయినా ఎటువంటి వారైనా వారికి పరిచర్య చేస్తాను’ అంది. నిజానికి ఆయన సేవాఫలితం ఆయన భార్యకే దక్కుతుంది. వారికి ముగ్గురు మగ పిల్లలు. ప్రభువు వారి కుటుంబము లన్నిటిని ఆశీర్వాదించాడు.

వారి సంతానపు వారు ఆశీర్వదింపబడుదురు. తమ సంతానపు వారిని ప్రేమించు వారందరు వారి దీవెన కొరకు దేవుని యెడల భయభక్తులు కలిగియుంటారు.

ఒకానొక స్నేహితునితో ‘మీ నాన్న (ఆయన గవర్నమెంటులో గొప్ప ఉద్యోగి) మీకేమిచ్చాడు’ అని అడిగినప్పుడు, అతని ప్రక్కన వున్న బ్రాందీ గ్లాసు పైకెత్తి ‘ఇది ఇచ్చాడు’ అని చూపించాడు. ఆ గ్లాసును అతను ఎక్కువగా ఉపయోగించినందు వలన 36 సంవత్సరాలకే చనిపోయాడు.

విశాఖలో విజయానందం అనే దైవసేవకుని ఇంటికి 15 సంవత్సరాల క్రితం వెళ్ళాను. వారు నన్ను బహుగా ఆదరించారు. ఒక సంవత్సరం క్రితం మరలా ఆ యింటికి వెళ్ళాను. ఆయన ఆ వూరిలో లేడు. అయినా ఆయన వున్నప్పుడు ఆ యింట్లో ఎలా వుండినదో అదే విధంగా వారి కుమారులు, కోడండ్రు జీవిస్తున్నారు. వారు గొప్పవారు కాకపోవచ్చు కాని దేవుని దీవెన కుటుంబంలో నుండి వెళ్లిపోకుండా కాపాడుకొనే విధంగా తీర్చబడ్డారు.

ఎట్లనగా యెహోవా అబ్రాహాముకు గూర్చి చెప్పినది అతనికి కలుగజేయునట్లు తన తరువాత తన పిల్లలును తన ఇంటివారును నీతి న్యాయములు జరిగించుచు యెహోవా మార్గమును గైకొనుటకు అతడు వారికాజ్ఞాపించు నట్లు నేను అతని ఎరిగియున్నానని యెను.

కాబట్టి ఒక కుటుంబము యొక్క ఆర్థిక స్థితికంటే, ఆత్మీయస్థితికి కారణము ఆ కుటుంబ యజమాని, యజమానురాలు బాధ్యులైయున్నారు.



.

సాక్ష్యము

# బ్రాహ్మణ పూజారి సత్యాన్వేషణ



**" విహ్వ్య గోప్తారాం మహాక్యాదధిన కర్యుంతి హన్వా యాన సర్వతాసీన్ "**

పిమ్మట ఎంత సమయం గడచిందో మాకు తెలియదు. స్పృహవచ్చి నేను తలెత్తి చూడగా ముందుకు రోడ్డులేనందున జుంగా యొక్క ముందు రెండు చక్రాలు గాలిలోయున్నవి. వెనుక భాగమునవున్న ఎడమ చక్రము రోడ్డు మధ్యలో యున్నది. ముందు సీటులోనున్న రామాసింగ్‌ను చూచితిని. వానికింకా స్పృహరాలేదు. మేము ఉభయులము మేఘము యొక్క ఆవిరితో తడిసిపోతిమి. నా ఒడిలోనున్న బైబిలు కాగితములు కూడ తడిసిపోయినవి. జుంగా యొక్క ముందు భాగముననున్న రెండు చక్రముల మధ్య ఒక చిన్నకైవారంగల చెట్టు కనబడుచున్నది. ఆ కొండ అంచునవున్న చెట్టుకు ఈ జుంగా యొక్క ముందు భాగము ఆనుకొని వున్నది. నా గుండె బహుశీఘ్రముగ కొట్టుకొనుచుండగా మరిక మేము బ్రతుకము అనే నిర్ణయానికి వచ్చాము. ఎందుకంటే గాలికి జుంగా కదలుచున్నది. నేను కదలకుండ నలువైపుల తిలకించి ఏమి చేయాలో తెలియక నా ఒడిలో తెరువబడియున్న బైబిలును చూచితిని. ఈ సంఘటన జరుగుచున్నప్పుడు నేను 121వ కీర్తన 3వ వచనము చదువుతున్నాను. ఆ వచనంలో 'ఆయన నీ పాదము తొట్రిల్లనీయడు. నిన్ను కాపాడువాడు కునుకడు' అని వుంది. ఆ వచనాన్ని మరల మనస్సులోనే చదువుకొని విశ్వాసం తెచ్చుకొని ఏడ్చుచు దేవునికి స్తోత్రములు చెల్లించుట ప్రారంభించాను. 'హల్లెలూయా, హల్లెలూయా, హల్లెలూయా' అని స్తుతించుచున్నాను. నా స్తుతి శబ్దమును, నా ఏడ్పు ఘోషను విని డ్రైవర్ రామ్‌సింగ్ స్పృహలోకి వచ్చి జరిగిన సంఘటనను గ్రహించి ఏమి చేయాలో తనకు అర్థం కానప్పటికీ నాతో కలసి తన రెండు చేతులు జోడించి పైకెత్తి 'హల్లెలూయా.. హల్లెలూయా..హల్లెలూయా' అని భయంతో ఏడవటం ప్రారంభించాడు. ఆ విధంగా స్తుతిస్తూ నేను క్రిందికి చూశాను. శూన్యం, అగాధం, చీకటి కళ్ళు తిరుగుచున్నవి. పైకి చూశాను మేఘము గగనము నాకు కనబడుటలేదు. ఏమియు తోచక ఆలాగుననే స్తుతిస్తూ బహుగా దుఃఖిస్తూ 'మాకిక రక్షణ లేదు' అని తలంచుచూ ఒడిలోవున్న బైబిలును చూశాను. 'ఇశ్రాయేలును కాపాడువాడు కునుకడు, నిద్రపోడు. యెహోవాయే నిన్ను కాపాడువాడు. నీ కుడిప్రక్కను యెహోవా నీకు నీడగా ఉండును. పగలు ఎండదెబ్బయైనను నీకు తగులదు. రాత్రి వెన్నెల దెబ్బయైనను నీకు తగులదు. ఏ అపాయము రాకుండా యెహోవా నిన్ను కాపాడును. ఆయన నీ ప్రాణము కాపాడును. ఇది మొదలుకొని నిరంతరము నీ రాకపోకలయందు యెహోవా నిన్ను కాపాడును'. ఈ వచనములు నా కంటపడగా నాకు బహు ధైర్యము కలిగినది. విశ్వాసంతో 'రామ్‌సింగ్, దేవుడు' అని నేనంటుండగా మధ్యలోనే 'ఎవరా దేవుడు?' అని రామ్‌సింగ్ నన్ను ప్రశ్నించాడు. అప్పుడు నేను 'యేసుప్రభువు అను దేవుడు మన ప్రాణములను కాపాడును. చూడు కొద్ది క్షణములలోనే యేసుప్రభువు మనుష్యులను మన రక్షణార్థమై పంపించును' అని నేనంటుండగానే మేము వచ్చిన దారిగుండా మా వెనుక బ్రిగేడ్ కమాండర్ తన సిబ్బందితో బయలుదేరవలసినదని వేరొక డ్యూటీలో అదే మార్గములో వెళ్లుచున్నారు. వారు మాకంటె ముందు వెళ్లిపోవలసినవారే కాని దైవ సంకల్పము ఈ విధంగావుండెను. దుష్టుడు నన్ను త్రోవలోనే హతమార్చాలన్న ప్రయత్నము చేసెను. దుష్టుని ప్రయత్నము ముందుగా తెలుసుకున్న యేసుప్రభువు మా రక్షణార్థమై బ్రిగేడ్ కమాండర్‌ని మా వెనుక పంపించారు. బ్రిగేడ్ కమాండర్ అచ్చట ఆగి విషయాన్ని గ్రహించి వెంటనే తన బండిలోనున్న వైర్‌లెస్ మాస్ట్‌ను పైకెత్తి వైర్‌లెస్ మెసేజ్ ఇచ్చి క్రేన్‌ను రప్పించి మమ్ములను రోడ్డుమీదకు బండితో సహా లాగుటలో తను స్వయంగా శ్రద్ధ తీసుకున్నారు. పిమ్మట మేము తన బండిలో నురానాంగ్ వెళ్ళాము. కోర్ట్ ఆఫ్ ఇంక్వైరీలో జరిగిన సంగతిని చెప్పమని అడుగగా రామ్‌సింగ్ జరిగినదంతాచెప్పి మరణించిన మాకు మరల జీవించునట్లు కృపచూపినాడు ఆ హల్లెలూయా దేవుడు అన్నాడు ఈ హల్లెలూయా దేవుడెవరని అధికారులు వానినడుగగా 'రావ్‌సాహెబ్‌ను అడగండి ఆయన చెప్తారు' అని వారికుత్తరమిచ్చెను. కొన్ని దినములు జరిగాక రామ్‌సింగ్ అతని భార్య ఇద్దరూ హిందీ బైబిలు కొనుక్కొని చదువుట ప్రారంభించిరి. ప్రభువునందు గొప్ప విశ్వాసమును కలిగియుండిరి. ఒకరోజు ప్రభువు అతని భార్యతో 'నీ భర్తను బ్రతికించిన వాడను నేనే గనుక అతను నా కొరకు జీవించాలి' అని చెప్పగా ఆ విషయము వారు నాతో చెప్పగా దాని భావమును నేను వారికి వివరించాను. వారు ఉద్యోగములో

నుండి డిస్చార్జ్ తీసుకొని బీహార్ రాష్ట్రము వెళ్లిపోయారు.

"ప్రతి నాలుకయు దేవుని స్తుతించును" అని రోమా 14:12లో వ్రాయబడివుంది. ఈ వాక్యానుసారముగా జోగాసింగ్‌గారు తన కుంటుంబము, రామ్‌సింగ్‌గారు తన భార్య వీరు అన్యులైనను వారి నాలుక దేవుని స్తుతించెను. టేంగావేలిలో రెబెక్కాగారు ఏడు మాసముల గర్భము ధరించియుండెను. ఆమె ఉపవాసములతో ప్రార్థించుట వలన తన గర్భమందుగల శిశువు దుర్బలమాయెను. ఈ కారణంగా ఆమెను దహంగ్ మిలటరీ వైద్యశాలలో చేర్పించారు. ఈ వార్త నాకు తెలియజేయగా నేనావెను చూడటానికి ప్రయాణమయ్యాను. ఉదయాన్నే ఐదున్నర గంటలకు నురానాంగ్ నుండి బైసాఖీ హెలికాప్టర్‌లో వెళ్ళాల్సివుండెను. అదే రాత్రి రెబెక్కాగారు ఆసుపత్రి నుండి ట్రంకాల్ చేసి నాతో మాట్లాడి 'నేనిప్పుడు క్షేమంగానే యున్నావు. మీరు నా విషయమై దిగులు చెందకండి. నాకు చికిత్స చేయుచున్నారు. మీరు నురానాంగ్‌లో దేవుని కార్యమును చేయుటకు సిద్ధ పడండి. నేను సెజ్జమీద నుండియే ప్రార్థించుచుంటాను' అని నన్ను ధైర్యపరచెను. ఈ విధంగా మేము ప్రతి రెండు మూడు రోజులకోసారి టెలీఫోనులో మాట్లాడుకునే వాళ్ళము.

నురానాంగ్‌లో మూయబడిన గుడి తలుపులు తెరచుటకు సహాయపడవలసినదని (నాకంటె ముందుగా వెళ్తానని వాగ్దానము చేసిన) దేవుని ప్రార్థించాను. మూడు రోజులు బాగా ప్రార్థించి, అక్కడ వున్న ఒక మిలటరీ ఆఫీసర్‌తో మాట్లాడాను. అన్ని విషయాలు ఆయనతో చెప్పిన తరువాత ఆయన సంతోషించి ఆరాధన ప్రారంభించటానికి ఆర్డర్స్ జారీచేసెను. అక్కడ చాలామంది మిలటరీ ప్రజలు వారానికి రెండుసార్లు ప్రార్థనలో కూడుకునేవారు. అక్కడ వున్న ఒక బౌద్ధమత గుంఫా నాయకుడు నాతో తర్కించి 'బుద్ధుడు భగవంతుడు కాడా?' అని ప్రశ్నించెను. 'మీరు దేవుడవుతారా?' నేనతనికి ఎదురు ప్రశ్నవేసి అనేక విషయాలు ఒకనెల రోజుల వరకు ఆయనకు బోధించగా ఆయన గుంఫాను విడిచి ఆదివారం ఆరాధనకు చేరెను. ఈ విషయము ఆ ప్రాంతపు వారు విని ఆ రాత్రి ఆయనతో తగవులాడి మద్యపానీయపు మత్తులో మునిగి కత్తితో ఆయనను పొడిచి చంపిరి. నేను మిలటరీ సిబ్బందితో యుండుటచేత మా స్థలమునకు వారు రాలేకపోయిరి. లేనిచో నన్ను గూడ వారు చంపియుందురు. నాకు ప్రాణాపాయకరమైన దుర్ఘటన ఎప్పటికైన సంభవింపగలదని. మిలటరీ అధికారులు, నన్ను అచ్చట నుండి తవాంగ్ పంపించిరి. నేను తవాంగ్ ప్రయాణమై వెళ్ళిపోతిని. అచ్చట ఎవరో ఒక మిషనరీ (విజ్ఞాన శాస్త్రజ్ఞుడు) వృత్తిరీత్యా వచ్చి మందిరమొకటి అచ్చట నిర్మించెను ఆ మందిరము అనేక దినముల నుండి మూయబడియుండెను. అచ్చట ఒక దైవ సేవకుడుండే వాడు. తాను స్త్రీలోలత్వమునకు, మద్యపానియములకు బానిసయై అన్యజనాంగములతో కలసి బౌద్ధమత గుంఫాలో చేరియుండెను. ఇది ఈ విధంగా జరుగుటకుగల కారణము ఏమనగా ఆ శాస్త్రజ్ఞుడు విదేశమునకు మరలి ఆ దైవజనునకు డబ్బు పంపించునంత కాలము ఇతడు ఆ బౌద్ధమతస్తులలో పరిచర్య చేయుచుండెను. విదేశాల నుండి పంపబడుచున్న ఆర్థిక సహాయము ఏదో కారణం చేత ఆపివేయబడగా ఈ దైవజనుడు తిరిగి తన బౌద్ధమత గుంఫాలో చేరిపోయెను. కొన్ని పరిచర్యలు ఈ విధంగానే వుంటాయని తెలుసుకొనగలిగితిని. డబ్బు కొరకు చేసే సేవ దైవసే అనబడదు. అక్కడ ఆ మందిరంలో నేను ప్రవేశించి వాక్యపరిచర్యచేయగ అనేకమంది వచ్చి ఆరాధనలో పాల్గొనుచుండెడివారు. నాకు తెలియకుండానే ప్రభువు ఒక గుండె వ్యాధిగల మిలటరీ జె.సి.ఓను స్వస్థపరచెను. మేజర్ కురియెన్ అనునొక కేరళ సహోదరుడు బహుకాలము నుండి మద్యపానియమునకు గురియై వ్యాధిగ్రస్తుడై యుండెను. మూడు వారాలు అతని కొరకు ప్రార్థించగా ప్రభువు తనను స్వస్థ పరచెను. కెప్టెన్ జి.కె.నాయర్ యొక్క కుమారుడు బొమ్‌డిలా జిల్లా హెడ్‌క్వార్టర్స్‌లోవున్న కేంద్రీయ విద్యాలయంలో సీట్లు లేనందున (ఆలస్యంగా వచ్చినందుకుగాను) చదువుకొనుటకు ఆటంకము కలిగెను. ఈ విషయం నాతో చెప్పగా వాని చదువు కొరకు ప్రభువువద్ద నేను ప్రార్థించాను. పిదప అరుణాచల్‌ప్రదేశ్ రాష్ట్ర విద్యాశాఖమంత్రి ప్రత్యేకమైన ఆర్డర్సు జారీచేయగా జి.కె.నాయర్‌గారి కుమారుడు చదువు కొనసాగించు కొనుటకు ప్రభువు సహాయపడెను. ఇంతలో నాకొక ఆలోచన తట్టినది. ప్రభువు వద్ద నేను 'ఈ ప్రాంతమును విడిచి కొంతకాలానికి వెళ్లిపోతాను కదా! రక్షింపబడిన ఈ మూడు స్థలములలోనున్న జనములకు దైవాత్మతో పెంచుటకు పనివారిని పంపుము' అని ప్రార్థించాను. తత్ఫలితంగా నాలుగు నెలల్లో ఒక మిషనరీ ఆ ప్రాంతములకు వచ్చి పరిచర్య ప్రారంభించెను. రెబెక్కాగారు గర్భవతియై నవమాసములు నిండాయి. నేను ప్రార్థించగా నా ప్రభువు నాకు ఆ ప్రాంతములో నుండి విడుదల కలిగించాడు.

(సశేషం)

# యజ్ఞము

**పండిత సిహెచ్. ఫ్రాన్సిస్**

**ప్రశ్న :** క్రీస్తుకు పూర్వకాలమందున్న పితరుల గతి ఏమి?

**జవాబు :** క్రీస్తు బలిద్వారానే భక్తులగు పితరులు పరలోక గతులైరి. అంతదనుక వారు స్వర్గ పాతాళ లోకములకు భిన్నమైననొక స్థలమందుండిరి. దీనినే అదృశ్య లోకము లేక పరదైసుయందురు (లూకా 16:22,23). రక్షకుడు సిలువ సిలువ వేయబడినప్పుడు ఆయనతో కూడ సిలువ వేయబడిన యిద్దరు దొంగలలోనొకడు పశ్చాత్తాపపడి – యేసూ, నీవు నీ రాజ్యముతో వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసికొనుము అనెను. అందుకాయన వానితో నేడు నీవు నాతో కూడా పరదైసులో ఉందువని నిశ్చయముగా నీతో చెప్పుచున్నాననెను. కావున క్రీస్తు లేఖనముల ప్రకారమే సిలువ వేయబడి చనిపోయినంతనే అదృశ్యలోకమగు పరదైసు లోనికి దిగి అచ్చటగల పితరులతో మూడు దినములుండి మరణమును జయించి లేచి తన బలికై నిరీక్షించి తాత్కాలిక యజ్ఞయాగ ములు చేసి ఆయన ధర్మశాస్త్రానుసారముగా నడుచుకొనిన ప్రాచీనులకు సద్గతి నొసంగుటకై వారిని పరలోకమునకు చేర్చెను. అందుచేత ఆయన ఆరోహణమై నప్పుడు చెరను చెరగా పట్టుకొనిపోయి మనుష్యులకు ఈవులను అనుగ్రహించె నని ప్రవక్త చెప్పుచున్నాడు. ఆరోహనమాయె ననగా (మొదట) ఆయన భూమియొక్క క్రింది భాగములకు దిగెననియు అర్ధమిచ్చు చున్నదిగదా! దిగినవాడు తానే సమస్తమును నింపునట్లు ఆకాశమండలములన్నిటికంటె మరిపైకి ఆరోహణ మైనవాడునై యున్నాడు (ఎఫెసి. 4:8–10). ఐతరీయా బ్రాహ్మణములో వ్రాయబడినదేమనగా – పూర్వకాలమున దైవములు (ఆర్యులు) మానవుని బలిగ నిచ్చుచుండిరి. అప్పుడు బలిసారము మానవుని నుండి వెడలి గుఱ్ఱమును వదలి ఎద్దును చేరెను. దానిని గని ఎద్దును బలిగా నిడిరి. అది మేకను జేరగా దానిని బలిగనిడిరి. బలిసారము భూమిలో జొచ్చెను. దానిని వెదకుటకు భూమిని త్రవ్విరి. బలిసారము బియ్యములోను గోధుమలోను చేరియుండెను. పశ్వాది బలుల నుండి ఎంత బలిసారము దొరకుచుండెనో అంతసారము బియ్యమునందును గోధుమలయందును నుండుటచే తెలిసిన వారు ఈ వస్తువులనే బలి (పూజా ద్రవ్యము)గ నిడుదురు.

యూదులు కూడా గోధుమపిండిలో నూనె పోసి సాంబ్రాణి వేసిన నైవేద్యమును యెహోవా దేవునికి బలిపీఠము మీద హోమముగా దహించిరి (లేవీ. 2:1–3). కాబట్టి క్రీస్తు ప్రభువు తనను తానే గోధుమగింజతో పోల్చుకొని తాను సిలువ వేయబడినప్పుడు అనగా బలియైనప్పుడు అందరిని తన యొద్దకు ఆకర్షింతునని చెప్పెను (యోహాను 12:23–32).

భూమి నుండి మొలచిన సత్యము క్రీస్తే (కీర్తన 85మ11). నేనే సత్యమును జీవమునైయున్నాను అని ఆయన చెప్పెను (యోహాను 14:6). ఆత్మీయమైన ఆకలిదప్పులు గలవారు జీవాహారమైన క్రీస్తును భుజించి, అనగా ఆత్మీయ ముగా ఆయన శరీరము తిని ఆయన రక్తము త్రాగినచో నిత్యజీవముగలవారైయుందురు. వారు మరణించినను అంత్యదినమున వారిని లేపుదునని ప్రభువు సెలవిచ్చెను (యోహాను 6:35; 52:58).

ఈ కాలపు హైందవులు ఆచరించు పంచయజ్ఞములు కూడా క్రీస్తు రక్షణార్ధమై చేసిన మహాయజ్ఞమందే కలిసి పోయినవి. ఎట్లనగా –

**1) దేవ యజ్ఞము :** దైవ త్రిత్వములో రెండవ వాడగు క్రీస్తు (దేవునిలో దేవుడైయుండి) యజ్ఞ పశువుగా వధింపబడి దేవునికి ప్రీతికరమగు హోమమాయెను.

**2) పితృ యజ్ఞము :** పితరులకు క్రీస్తు బలిద్వారా సంపూర్ణసిద్ధి కలిగెను (హెబ్రీ. 11:40). ఇందుకు సాక్ష్యముగా సమాధులు తెరువబడెను. చనిపోయిన అనేకమంది పరిశుద్ధుల శరీరములు లేపబడెను (మత్త. 27:52).

**3) భూత యజ్ఞము :** క్రీస్తు సిలువ వేయబడుటచే పశుబలి నాపి ప్రపంచ పునర్జన్మకు పునాది వేసెను (రోమా 8:21). రానున్న క్రీస్తు రాజ్యములో హింసలేనందున క్రూర జంతువులు సాధు జంతువులతో కలసి గడ్డిమేయును (యెష. 11:6–9).

**4) మనుష్య యజ్ఞము :** పాప, మరణ, నరకముల నుండి మానవులను విడిపించుటకై ఆయనే బలియాయెను (రోమా 6:14; హెబ్రీ. 2:14,15; రోమా 8:1).

**5) బ్రహ్మ యజ్ఞము :** క్రీస్తే దేవుని వేదము అనగా జ్ఞానము. (1కొరిం. 1:24). ఆయనే వాక్యమైయున్నాడు

(యోహా. 1:1). కనుక అక్షర బ్రహ్మయగు ఆయనను ప్రతి దినము పఠింపవలెను.

మానవులొనరించిన పంచ మహా పాతకముల పరిహారార్థమై రక్షకుడు పంచ గాయములను పొందెను. సిలువను గూర్చిన వార్త, నశించుచున్న వారికి వెఱ్ఱితనము గాని రక్షింప బడుచున్న వారికి అది దేవుని శక్తియైయున్నది. లోకము తన జ్ఞానముచేత దేవునిని ఎరుగకుండి నందున సువార్త ప్రకటన యను వెఱ్ఱితనముచేత నమ్మువారిని రక్షించుటకు దేవుని దయాపూర్వక సంకల్పమాయెను (1కొరిం. 1:18-21).

ప్రశ్న : యజ్ఞము లేకుండా దేవుడు పాపములను క్షమించలేడా? ఆయన కృపగలవాడు గదా!

జవాబు : దేవుడు సత్యమైయున్నాడు. ఆయన ప్రేమయై యున్నాడు. సత్యమునుబట్టి ఆయన పాపులను శిక్షింపవలసి యున్నది. ఆయన ప్రేమగల వాడు గనుక కృపతో పాపులను క్షమింపవలెను. అయితే కృపా సత్యములు ఒకదానికొకటి విరుద్ధములై యున్నవి. సత్యము నెరవేర్చవలెనన్న కృపయు, కృపను నెరవేర్చవలెనన్న సత్య మును అడ్డగించును.

శిబి చక్రవర్తిని గూర్చిన గాథను ఈ విషయమున స్మరించుట యవసరము. శిబి చక్రవర్తి దయగలవాడగుట చేత తన శరణుజొచ్చిన పావురమును రక్షింతునని అభయ మొసంగెను. అంతట డేగయొగటి అచ్చటికరుదెంచి తానా పావురమును భక్షింపకున్నచో ఆకలిచే మరణింతుననియు, న్యాయము చొప్పున జరిగింపగోరినచో ఆ పావురమును వదలక తప్పదనియు వాదించెను. అప్పుడు శిబి బాగుగా ఆలోచించి ఆ పావురమంత మాంసమును డేగకిచ్చుటకు ఒప్పించి తుదకు తానే తన మాంసమును బలిగా డేగకర్పించెను. గనుక కృపాసత్యములకు చిహ్నములైన ఆ రెండు పక్షులు సంతసించి రాజీపడెను. ఇదే సత్యమును పరిశుద్ధ గ్రంథము బోధించుచున్నది సుమా! ఆదియందు వాక్యమై యున్న అనగా శబ్ద బ్రహ్మమగు ఓంకారమైయున్న దేవుడే శరీరధారియై కృపాసత్య సంపూర్ణుడుగా మన మధ్య నివసించెను (యోహాను 1:1-5, 14). దేవత్వము యొక్క సర్వ పరిపూర్ణత శరీరాకారముగా క్రీస్తునందు నివసించు చున్నది (కొలొస్స. 2:9). పాపులను రక్షించుటకై క్రీస్తు సిలువ వేయ బడుటచే మానవులు పొందవలసిన శిక్షను తానే పొంది సత్యమును నెరవేర్చెను.

అట్లే వారి పాపములను క్షమించి కృపను నెరవేర్చెను. క్రీస్తును గూర్చిన సాక్ష్యము ప్రవచనానుసారమైనది (ప్రక. 19:10). కావున దీర్ఘదర్శి క్రీ.పూ. 1000 సం॥ల నాడే యిట్లు ప్రవచించెను - "కృపాసత్యములు కలిసికొనినవి; నీతి సమాధానములు ఒకదానికొకటి ముద్దుపెట్టుకొనినవి; భూమిలో నుండి సత్యము మొలచును. ఆకాశములో నుండి నీతి పారజూచును" (కీర్తన 85:10,11). ఈ వచనముల భావము క్రీస్తు సిలువ వేయబడినప్పుడే నెరవేరెను. కాబట్టి మహా జ్ఞానియగు సొలొమోను చెప్పినట్లు "కృపాసత్యముల వలన దోషమునకు ప్రాయశ్చిత్తము కలుగును" (సామె. 16:6).

శ్లో॥ యద్గురుయజ్ఞ కర్మంచ, యజ్ఞంచ సర్వసిద్ధి యేత్
యజ్ఞయేవ సర్వస్యాధ్యంచ, యజ్ఞకర్మ పరాత్పరమ్।
(గురుగీతలు)

అనగా జగద్గురువు యజ్ఞము చేయగా ఆ యజ్ఞము వలన సర్వము సిద్ధించును. దాని వలననే సర్వము సాధ్యమగును; (కావున) యజ్ఞకర్మయే పరాత్పరమై యున్నది. మరియు -

శ్లో॥ నపుణ్యం దానధర్మ నకర్మశ్చ పుణ్యం భవతే ॥
నపుణ్యో ప్రాణదనశ్చ జగత్పుణ్యం నాస్తి; నాస్తి॥

అనగా దానధర్మములచేతను కర్మచేతను, పుణ్యము కలుగదు. ప్రాణదానము లేకుండ ప్రపంచమునకు పుణ్యమే లేదు. ఇట్లు ప్రాణదానము చేయ సమర్థుడు బరబ్రహ్మమగు గురువైయున్నాడు. "గురుదేవ పరబ్రహ్మ" మరియు "మంత్రోగురుః" మంత్రమే గురువు. (ఋగ్వేదము 1 మం. 147 సూ. 4 మ.). (సశేషం)

**పాఠకులకు గమనిక**

ఈ సంవత్సరము (2008) నుండి పత్రిక సంవత్సర చందా **150/-** రూపాయలకు పెంచడమైనది. మేము పంపించే పత్రిక 90% మందికి ఉచితంగా వెళ్తుంది. ఈ పత్రిక ఉచితంగా పొందుతున్న వారిలో ఎక్కువ మంది అన్యజనులే. అంటే చందా పంపించే కొద్దిమంది ద్వారానే ఈ పత్రిక నడిపించబడుతుంది. క్రమం తప్పకుండా చందా పంపే వారు మా సాహిత్య సేవలో మమ్ములను అర్థం చేసుకుని మాతో సహకరిస్తున్నందుకు వారికి మా కృతజ్ఞతలు. చందా పంపదలచిన వారు మా యొక్క బ్యాంక్ (S.B.I.) ఆన్‌లైన్ అకౌంట్ నెం. **10957294362** ద్వారా పంపవచ్చును. కనుక పాఠకులు గమనించ ప్రార్థన.

# రక్షణ కార్యము

1

### (ఏకపాత్రాభినయం)

**పరిచయము : జడ్.సి. దేవదానము,** మొదటి తరము విద్యనార్జించిన కుటుంబమునకు చెందినవాడు. ఆయన తల్లిదండ్రులు కేవలము నిరక్షరాస్యులు. వారి తండ్రి ఒక అనాథ. ప్రభువును గూర్చి ఏ మిషనరీల దగ్గరగాని, పేరు మోసిన సువార్తికుల దగ్గరగాని విని మారుమనస్సు పొందలేదు. ఆయన శ్రీ జడ్డా లక్ష్మయ్య చాలా యాధృచ్ఛికంగా తన కులవృత్తికై కర్నూలు జిల్లాలోని శ్రీశైలమునకు చాల సమీప మునవున్న నల్లమల్ల అరణ్యములోని పెచ్చెర్వు అనే చెంచుగూడె మందు పశువుల తోళ్లు కొనే నిమిత్తము వెళ్లినప్పుడు శ్రీమతి వినుకొండ ప్రేమమ్మ టీచర్‌గారి ద్వారా యేసుక్రీస్తు రక్షణ సువార్త విని ప్రభువును తన స్వంత రక్షకునిగా అంగీకరించుట ద్వారా తన జీవితం మార్పునొంది తన ఏడుగురు సంతాన మును విద్యావంతులుగా చేశారు. సంఘసేవ, సామాజిక సేవ మార్కాపురం తాలూకాలో పేరెన్నికగల క్రైస్తవుడుగా, గొప్ప దాతృత్వముగలవాడుగా గుర్తింపబడ్డాడు. ఆయన మూడవ సంతానము జడ్.సి.దేవదానం. ఈయన యం.ఎ. ఎకనామిక్స్ చదివి, కర్నూలు, ఎస్.టి.బి.సి. కాలేజిలో సీనియర్ లెక్చరర్‌గా పనిచేసి రిటైరయ్యారు. ప్రస్తుతం నేషనల్ కౌన్సిల్ ఆఫ్ చర్చస్ ఇన్ ఇండియా అనే 29 ప్రొటెస్టంట్ డినామినేషన్స్ యొక్క జాతీయ సంస్థకు ట్రెజరర్‌గా వున్నారు. వీరికి ఒక కుమారుడు రెవ జడ్.ఆర్.చక్రవర్తి, ఇద్దరు కుమార్తెలు కర్నూలులో లెక్చరర్స్‌గా పనిచేస్తున్నారు. వీరి సతీమణి శ్రీమతి వి. లారా సెరేన్‌కుమారి మిషన్ హైస్కూలులో హెడ్‌మిస్ట్రెస్‌గా పనిచేసి రిటైర్ అయ్యారు.

**రచయిత మాట :** మన క్రైస్తవ మత బోధకులు (కేవలం) సాతాను, అపవాది ఒక పెద్ద దయ్యంలాగా, సర్పరూపముగా చెప్తుంటారు. అసలు అపవాది ఎవరు? ఎలా అపవాది లేక సాతాను అయ్యాడు? యెహోవా దేవుడు సృష్టిలోనే అతన్ని అలా సృష్టించాడా? నరుని సృష్టించిన క్రమము కన్నా ముందు ఏముంది? 'పాపము' ఎప్పుడు ఎవరితో చేయబడింది? నరునికి అపవాదికి ఎందుకు శతృత్వం ఏర్పడింది? ఆ శతృత్వము యొక్క పరిణామమేమిటి? ప్రభువైన క్రీస్తు సిలువయాగము ద్వారా జరిపిన 'రక్షణ కార్యము' ముందు పాపపరిహారార్ధము రక్తతర్పణము జరిగిందా? ఎందుకు జరిగింది? అపవాది యెహోవాపై ప్రతీకారము తీర్చుకోవాలను కున్నాడా? అందుకు ఏమి చేశాడు? ఆశించిన ఫలము సాతాను పొందాడా?

పై ప్రశ్నలు ప్రభువైన యేసు పాదాల దగ్గరుంచి చేసిన మొర ఫలితమే ఈ రెండు నాటికలు 'ధవళ సింహాసనము', 'రక్షణ కార్యము'. 1994లో ప్రభువు నన్ను దర్శించి, తన స్వంతబిడ్డగా చేసికొని, అసలు తెలుగు బాషలో కనీస ప్రవేశములేని నాతో ఈ రెండు నాటికలు వ్రాయించి, కర్నూలు స్టాంటన్ మెమోరియల్ తెలుగు బాప్టిస్టు సంఘములో రెండు ప్రదర్శనలకు దర్శకత్వము వహించి, నటింపజేసిన దేవదేవునికి హృదయపూర్వక కృతజ్ఞతా వందనములు.

ఈ ప్రక్రియను నేను డాక్టరు కొడవటికంటి సామ్యేలు రాజేంద్రగారితో చర్చించినపుడు, సహృదయముతో విని వారు 'హన్నాకృప' క్రైస్తవ ఆధ్యాత్మిక మాస పత్రికలో ప్రచురించుటకు సమ్మతించినందుకు వారికి కృతజ్ఞతలు.

పాఠకులు 'ధవళ సింహాసనము', మరియు 'రక్షణ కార్యము' కలిపి చదివిన యెడల రచయిత ఏమి చెప్పాలని ఆశించాడో అది నెరవేరగలదని నమ్మకము.

–జడ్.సి.దేవదానము

## ఏకపాత్రాభినయం

**సైతాను:** చీకటి... కటిక చీకటి.. అంధకారము.. గాఢాంధ కారము.. మహా గాఢాంధకారము.

**లూసీఫర్ :** ఎటు చూచిన కాంతిలేని స్థితి.. మనశ్శాంతి లేని స్థితి..దుర్భరము.. వేదన, బాధ భరింపలేని మహావ్యధ.. నా కాయలు బొబ్బలు, పుండ్లు మాయమై భరించలేని తీవ్రతరమైన నొప్పులు, అంతులేని క్షోభకు గురియైనది. అబ్బా... అయ్యో.... అయిననూ..

పగ..పగ.. ద్వేషం... ప్రతీకారం.. ప్రతీకారమే ధ్యేయం, లక్ష్యం. యెహోవా దేవుడు! నేను ప్రధాన దూతను అభిషక్తుడను అనితర సాధ్యమైన బలవంతుడనని ఎరిగియు, నేను కోరుకున్న

స్వేచ్ఛ, స్వాతంత్ర్యము మన్నింపరాని అపరాధమని ఎంచి, మీదు మిక్కిలి స్వార్ధము, నిరంకుశత్వముతో నన్ను, నా అనుచరగణమును ఉరుములు, మెరుపుల జ్వాలలతో కొట్టి క్షతగాత్రులను చేసి కటిక చీకటిలో నిత్యాగ్నిలో ఎనలేని హింస, సహింపజాలని వేదన ననుభవించునట్లు ఆ దివ్యలోకము నుంచి పాతాళ లోకమున పడవైచి...

తన హస్తములతో తన పోలికన, తన స్వరూపములో మానవుని నిర్మించి, తన జీవాత్మ నూది నరుని సృజించి, సృష్టి యావత్తుకు ఏలికగాజేసి, ఆయన మా అవిధేయతవల్ల కోల్పోయిన సంతొషానందాలను తిరిగి పొందాలని ఆశిస్తున్న ట్లున్నాడు. అధమ నరుని అందలమెక్కించి ఆధ్యుని చేయాల నాకాంక్షిస్తున్నట్లున్నాడు. ఆ ప్రకారమే జరిగిన.. నేను, నా అనుచరగణము యొక్క యుక్తిశక్తులు వృధా!

నేను నా శరీర తేజస్సు కోల్పోయినా, దివ్యలోకము నెదిరించగల పౌరుషము, రోషము, కండబలము, గుండె బలము దండిగ కలిగి, అన్నింటిని మించిన కపటము, అసత్యము, మోసపూరిత వాగ్ధాటిని కోల్పోలేదు.

ప్రతీకారేచ్ఛ, రగిలే గుండె, పాషాణమైన మనస్సాక్షితో, అంతకు యిబ్బడిముబ్బడి చెల్లించగల ఘనాపాటిననీ నిరూపిస్తాను. ఆ దేవదేవుని సంతోషానందాలకు విఘ్నము కలిగించుట, అడుగడుగున అవరోధము, ప్రతి అడుగున ప్రతిబంధకము కలిగించుటయే నా ధ్యేయము. దెబ్బకుదెబ్బ చెల్లించెద... ప్రతీకారము తీర్చుకొననిదే విశ్రమించను, నా అనుచరులను విశ్రమించనియ్యను.

మహా దేవుడు భూమి మీద నరుని సృజించినందుకు పశ్చాత్తాపమునొంది, పరితపించవలె. మనోవేదనతో కృంగి, కృషించి నశించవలె. అప్పుడే నాకు మనశ్శాంతి, విశ్రాంతి.

ఓ... అదిగో ఆదాము వచ్చుచున్నాడు. అతడు దైవాంశ సంభూతుడు, దైవాజ్ఞను అతిక్రమించడు... నా మాటలు విశ్వసించక నాచే శోధింపబడకపోవచ్చు.అతని శోధింప బూనుట అపాయకరము.

గనుక అతని దృష్టికి దూరము తొలగుటే శ్రేయ స్కరము. అతడే మాత్రము నా ఉనికిని పసిగట్టిన నా ప్రణాళిక భంగము కాగలదు. తగిన సమయమునకై వేచియుండెద.

ఆహా! హవ్వ, అదాముతో ఏమో సంభాషించుచున్నది. అహాహా! అది సంభాషణ కాదు, ఏదో విషయములో వాదులాడుకొనుచున్నారు.

అదిగో!... ఆ... హవ్వ ఈ వైపునకే చిరుకోపముతో రుస,రుసలాడుతూ వచ్చుచున్నది. అదాము కోపముగా అటువైపుగా వెళ్లినాడు. వారు విడివిడిగా ఒంటరిగా నున్న శోధనకు అనుకూల సమయము. ఇదియే సరియైన అదను. ఈమెను నా కుయుక్తితో వశపరచుకొని, మోసముతో వంచించి శోదనలో పడవైచెద. తదుపరి హవ్వ, సహాయ మున ఆదామును సైతం దైవాజ్ఞను అతిక్రమింపజేయవచ్చు. ప్రయత్నించెద, ఆలస్యం అమృతం విషం.

హవ్వా!... ఓ హవ్వా!! ఏమి?... ఏమేమి?... దేవుడు ఈ ఏదేను తోటలోని వృక్షఫలములను తినకూడదని చెప్పెనా?

ఏమిటీ? తోటలోని అన్ని వృక్షఫలములు తినవచ్చును గాని తోట మధ్యనున్న 'మంచిచెడులు' తెలుపు వృక్ష ఫలములు తనకూడదా? తినిన యెడల నిశ్చయంగా మరణమొందెదరని ఆ దేవుడు ఆదాముతో చెప్పెనా? అది అతడు నమ్మి, నీతో చెప్పిన నీవును నమ్మితివా?

అది అబద్దము... పచ్చి అబద్దము... ఇది ఎంతటి నయవంచన... అయ్యో! ఎంత అమాయకులు మీరు.. మీ అమాయకత్వమును జూడ నాకు జాలి జనించుచున్నది.

అసలు మీరు 'చావనే చావరు'. ఆ వృక్షఫలములు తిను దినమున మీ నేత్రములు తెరువబడి మంచి ఏమిటో చెడు ఏమిటో తెలిసికొందురు. మీరు దేవతలవలె అగుదురు.

ఇది నిజమా యని అడుగుచుంటివా?

ముమ్మాటికి 'నిజము' నా మాటను విశ్వసించుము. అసత్యము పలికిన నాకొరుగనదేమి?

ఆ ఫలములు తినిన రోజున మీరు మంచి చెడులెరిగి దేవతలవలె అగుదురని ఆ మీ దేవునికి తెలియును. అందులకే ఆ ఫలములను తినవద్దని ఆజ్ఞాపించెను.

నీవే చూడుము. ఆ ఫలములు ఆహారమునకు మంచి విను, కన్నులకు అందమైనవి, వివేకమునిచ్చు రమ్యమైనవి గాన, తడవు చేయకు.. ఆ వృక్షఫలములను తిని దేవతలు కండి... ఊ... ఆ వృక్ష ఫలములను తిని దేవతలు కండి...

(సశేషం)

సాక్ష్యము

# అపోస్తులుడైన బి.వి ఎబినెజరు



ఆయన రక్షణ అనే బహుమానమును పొంది దేవుని పరిశుద్ధాత్మ అను వరమును కలిగియున్నప్పటికిని అతడు పాత జీవితములో చేసిన అప్పుల నుండి విడుదల పొందలేక పోవుచున్నాడు. అతని పాత అలవాట్లైన త్రాగుడు, జూదముల వలననే అప్పులపాలైనాడు. అయినప్పటికిని సాతాను మరలా మరలా వాటినే ఎత్తి చూపిస్తూ వాటిలో వున్న పాత ఆనందాన్ని గుర్తు చేస్తుండేవాడు. తరువాత అప్పుల వాళ్లను ఇంటి మీదకు పంపిస్తూ నిరాశపరుస్తూ ఉండేవాడు. ఎబినెజరు బ్రదర్ ఏమి చేయలేక మోకాళ్ళని ప్రభువుకు ప్రార్ధన చేసేవాడు. ప్రభువా ఈ అప్పుల వాళ్ళు నన్ను మానసికంగా ఎక్కువగా బాధిస్తూ నెమ్మది లేకుండ చేస్తున్నారు. సహాయం చేయవా ప్రభువా అని రోజంతా వేదనతో ప్రార్ధిస్తుండేవాడు. ఈ విషయంలో మనుష్యులవైపు చూడకుండా దేవునికి మొఱ్రపెడుతున్నాను దేవుడు తప్పక సహాయం చేస్తాడనే విశ్వాసంతో ఉన్నాడు.

ఎబినెజరు బ్రదర్ యొక్క ఈ దీన పరిస్థితిని ఆసరాగా తీసుకొని సాతానుడు అతనిని అనేక అక్రమార్జనలవైపు ఆలోచనలను త్రిప్పుచున్నది. అలాంటి తప్పుడు మార్గము లలో అర్జించుటకు కలిగిన ప్రేరణలను కొన్ని ఇక్కడ చదువరుల కొరకు పొందుపరచుచున్నాను.

1. ఒకసారి మద్రాసులో బస్టాప్‌లో బస్ కోసం ఎదురు చూస్తుండగా అనుకోకుండా ఆ మార్గముగుండా స్కూటరుపై పోవుచున్న ఒక వ్యక్తి జేబులో నుండి మనీ పర్సు క్రింద పడిపోయింది. వెళ్లి దానిని తీసికొని చూడగా అందులో కొన్ని వేల రూపాయల నోట్లు వున్నవి. అప్పుడు సాతానుడు ఒక ఆలోచన అతని మదిలో పెట్టినాడు. అదేమనగా నీ అప్పుల బాధనుండి విమోచింపబడడానికి దేవుడు ఏర్పాటు చేసిన డబ్బు ఇది. దీనిని తీసికొని వెళ్లి అప్పులు తీర్చుకొనుమని ఒక తలంపును తన మనస్సులో సాతానుడు పెట్టెను. కాని ఎబినెజరుగారు పరిశుద్ధాత్మతో నింపబడి యున్నాడు కనుక మరియు క్రీస్తు కొరకు సాక్షిగా జీవించుచున్నాడు. కావున పరిశుద్ధాత్మ దేవుడు ఆ సాతాను ఆలోచనను త్రిప్పికొట్టినాడు. ఎలాగంటే సాతానా నీవు నన్ను శోధింపవద్దు. నాకు అవసరమైతే నా దేవుడు నాకు డబ్బు ఇవ్వగల సమర్థుడు. కనుక నీవు నా వెనుకకు వెళ్ళుము. ఆయన తన యొక్క మంచి విధానములో నాకు డబ్బు ఇచ్చి, నా అప్పు తీర్చగలడు అని చెప్పాడు. ఆ డబ్బును ఆ స్కూటరు మీద వెళ్ళే వ్యక్తికి చేర్చాలని అతని సైకిలు మీద బయలుదేరాడు. బయలు దేరేముందు ప్రభువా ఈ విషయములో నాకు సహాయము చేయుమని చిన్న ప్రార్థన చేసుకొని బయలుదేరాడు. ఆశ్చర్యకరంగా అతనిని రైల్వే లెవెల్ క్రాసింగ్ వద్ద గేటు మూసిన కారణంగా నిలువ బడియుండుటను చూశాడు. ఆ డబ్బును అతనికి ఇచ్చినప్పుడు అతను ఎంతో ఆనందించుచూ కృతజ్ఞత చెల్లించి అతని నిజాయితీని శ్లాఘించినాడు. దేవునికి స్తోత్రము. సాతానుడు బ్రదర్ ఎబినెజరు చేతిలో ఓడించబడినాడు.

2. ఒకసారి బ్రదర్ ఎబినెజరు ప్రయాణము చేయుచుండగా ఒక అరబ్బీ దేశమునకు చెందిన షేకు అతని ప్రక్కన కూర్చునెను. ఆ షేకు జేబులో నుండి పర్సు క్రింద పడిన సంగతి గమనించకుండా వెళ్లి ముఖము కడుక్కొని తిరిగి వచ్చాడు. అప్పుడు బ్రదర్ ఆ పర్సును తిరిగి అతనికి ఇచ్చినప్పుధు అతడు ఎంతో కృతజ్ఞత చెప్పాడు. దేవుని దృష్టిలో నీతికార్యమును జరిగించిన వానిగాను సాతానుకు అప జయము కలుగజేసిన వానిగాను సంతోషిస్తూ దేవుని స్తుతించాడు.

3. పరిశుద్ధాత్మ దేవుడు ఎబినెజరుగారి హృదయాన్ని ఆత్మతో నింపినప్పుడు అతని ప్రతికార్యము సాతానుని సిగ్గు పరచేవిధం గాను దేవుని మహిమపరచే విధంగాను కనిపించును. ప్రతిసారి తన అప్పులను తీర్చుకొనుటకు దేవుడిచ్చిన అవకాశమని తలంచే విధంగా జరుగుచుండెను. కాని పరిశుద్ధాత్ముని జ్ఞానము చొప్పున వివేచినిచి తప్పుడు మార్గములో పయనించక సాతానుకు అవమానము తెచ్చాడు. అందునుబట్టి దేవునికి స్తోత్రములు చెల్లించెను.

4. బ్రదర్ ఎబినెజరుగారు ఆత్మలో ఎదుగుచుండగా సాతా నుడు అదేపనిగా ఆయనను నిరాశపరచి వెనుకంజ వేయించ డానికి సౌఖ్యమైన విలాసవంతమైన కార్యాలను ఆయన

జీవితములో ప్రవేశపెట్టెను. అయినప్పటికిని ఆయన అంకిత భావముతో వాటినన్నిటిని లెక్క చేయకుండా సేవాకార్య క్రమము ముఖ్యమని తలంచి సువార్తచేరని మారుమూల ప్రాంతములకు సువార్త కార్యక్రమములను తీసికొని వెళ్ళు చుండెను. అందునుబట్టి దేవుడు ఆయనను అత్యధికముగా ఆశీర్వదించుటను బట్టి ప్రతి అవసరత క్రీస్తులో తీర్చబడు చుండెను. రోజులు గడచే కొలది పరిశుద్ధాత్మ కార్యములు బలంగా జరుగుచుండెను. ఈ విధంగా సాతానుకు అపజయము కలుగజేసిన వానిగా సంతోషిస్తూ దేవుని స్తుతించాడు.

5. సాతానుడు ఇరుగు పొరుగు వారిని అతనికి వ్యతిరేకంగా ప్రేరేపించి అపహాస్యముగా తనతో ప్రవర్తించుటకు పురికొల్పుచుండెను. ఇంటి యజమానుడు ఒకానొకప్పుడు అద్దె అడగడానికి జంకేవాడు. ఇప్పుడు ఆయనతో ఎగతాళిగా పరాచకాడుటకు మొదలుపెట్టినాడు. అయినప్పటికిని ఆయన వారిని ఏ మాత్రము పరుషముగా మాట్లాడకుండా వారి హృదయాలను తనకు అనుకూలంగా ప్రేరేపించమని దేవునికి ప్రార్థించెను. ఈ విధంగా సాతానుకు అపజయము కలుగజేసిన వానిగా సంతోషిస్తూ దేవునిని స్తుతించాడు.

6. బ్రదర్ ఎబినెజరుగారు స్థిరంగా దేవునిని అనుసరిస్తు న్నాడని వినినప్పుడు అపో.పాల్‌ఆషేరుగారికి తెలియపరచి నపుడు ఆయన ఎబినెజరుగారిని అభిషేకించి సంపూర్ణసేవ నిమిత్తము 40 దినములు ఉపవాసముండి ప్రార్థించెను. సంపూర్ణ కాలసువార్తికునిగా లోకములోకి నశించు ఆత్మల రక్షణార్థము పంపించెను. ఎప్పుడైతే దేవుడు తనను సంపూర్ణ సేవ నిమిత్తము పిలుచుచున్నాడని ఆత్మలో గ్రహించెనో, వెంటనే తన ఉద్యోగంనకు రాజీనామా చేసెను. కాని సాతానుడు తనపై అధికారులను ప్రేరేపించి మంచి ఉద్యోగం మానితే తరువాత నీవు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొనవలసి వస్తుంది అని హెచ్చరించుచుండెను. సాతానుకు అపజయము కలుగ జేసిన వానిగా సంతోషించెను దేవునిని స్తుతించెను.

7. సహోదరుడు ఆత్మపూర్ణుడైయుండగా ఆయన వివేకము కలిగి ఆలోచించగలుగుచుండెను. ఇంతకు ముందు తనను నడిపించిన దురాత్మ నిర్గ. 5:8లో చెప్పబడిన ఫరోను నడిపిం చిన ఆత్మయే. ఈ ఆత్మయే ఇప్పుడు తన పైఅధికారులతో మాట్లాడింపజేయుచున్నాడు. ముఖ్యంగా డిప్యూటీ సి.యం.ఇ. అయిన గె్రాస్‌గారు రాజీనామా లేఖను త్రిప్పిపంపినాడు. ఆయన ఏమని చెప్పాడంటే ఎబినెజరు మానసిక పరిస్థితి సరిగ్గా లేనందున ఇది అంగీకరింపబడదని చెప్పి పంపెను. తరువాత ఆయనను పిలిపించి మంచి లాభదాయకమైన ఉద్యోగమును నీవు ఎందుకు వదులుకుంటావని చెప్పాడు. అలాగే తన రాజీనామా పత్రమును ఆయన తిరిగి దానిని ఎబినెజరుగారికి పంపించినాడు. పంపిస్తూ ఏమి రిమార్కులు వ్రాశాడంటే, ప్రస్తుతము ఎబినెజరు మానసిక పరిస్థితి సరిగా లేనందున రాజీనామాను అంగీకరించటం లేదని త్రిప్పిపంపి నాడు. అనేకమంది సువార్త సేవకులు ఆయనకు ఏమని సలహా ఇచ్చారంటే నీవు ఉద్యోగము చేసుకుంటూ సేవ చేయ వచ్చును. ఇంతమంచి ఉద్యోగము పోతే దొరకదు. ఈ ఉద్యో గము నీ సేవలో సహాయపడుతుంది అని. ఇంకా ఆఫీసర్లు ఏమన్నారంటే పదిన్నర సంవత్సరములు మంచి రైల్వే ఉద్యోగము చేసి ఇపుడు రాజీనామా చేసి సువార్త సేవ చేయడ మనేది తెలివిగల ఏ వ్యక్తి అయినా చేసే పనికాదు. ఈ లోక సంబంధమైన వ్యక్తుల ఆలోచనా ధోరణి వేరుగా ఉంటుంది. అందువలన 1964వ సంవత్సరమున ఆయన ఉద్యోగానికి రాజీనామా చేసి సంపూర్ణసేవలో ప్రవేశించారు. (సశేషం)

## ఎస్.యం.ఎస్. (S.M.S.) .పరిచర్య

**ఎవరికైనా ప్రతిరోజు దేవుని వాక్యము ఉచితంగా పొందగోరినచో లేదా మీ ప్రియులకు పంపగోరినచో 9908822365 నెంబరును సంప్రదించగలరు.**

ప్రతిరోజు 'హన్నాకృప' పాఠకులకు, శ్రేయోభి లాషులకు, మిత్రులకు దేవుని వాక్యము SMS చేయుటకు ప్రియులు ఎ.యన్.ఆర్.జక్కం గారు ప్రతినెల రూ.500/- అందించుచున్నారు. వారికి వందనములు. ఈ పరిచర్య ద్వారా ఎంతోమంది ఆత్మీయ మేలులు పొందుచున్నందుకు దేవునికి స్తోత్రములు చెల్లించుచున్నాము.

సీరియల్

# మహా యజ్ఞమ్

1

మనిషిని సృజించినది భగవంతుడే. ఈ సత్యాన్ని అందరూ అమోదించారు. ఎవ్వరూ కాదనలేరు. ఒకవేళ కాదన్నా నిరూపించలేరు. నరుడు పరాత్పరునివలె పవిత్రంగా జీవించాలని భగవంతుని ఆకాంక్ష. కానీ మనిషి మహాదేవుని ఆజ్ఞను ఉల్లంఘించి దైవసాన్నిధ్యానికి దూరమయ్యాడు. ఆజ్ఞాతిక్రమం, మానవ వర్గానికి మాయని మచ్చగా నిలిచిపోయింది. మర్త్యునికి, అమరునికి మధ్య అడ్డుగోడగా మారింది ఆ అజ్ఞోల్లంఘన. దైవం దయాశీలుడు కాబట్టి తాను సృజించుకున్న మానవాళని మన్నించి, తన దాపున చేర్చుకోవాలని అభిలషించాడు. అందుకు అనువైన మార్గం ఒకటే. ఆయనే స్వయంభవుడుగా, కన్య మరియ గర్భంలో మానవాకృతిని ధరించాడు. 'యేసు' అను పేరుతో ఉర్విలో ఉద్భవించాడు. 'యేసుప్రభువు', 'యేసుక్రీస్తు' అనే ఇరు సుప్రసిద్ధ నామాంతరాలు యేసు స్వామికి ఉన్నాయి. 'యేసు' అంటే ముక్తిప్రదాత. ఒక్కమాటలో 'రక్షకుడు' అనవచ్చు. క్రీస్తు అంటే, దైవాత్మచే అభిషేకింపబడిన 'అభిషిక్తుడు' అని వ్యక్తీకరింపబడినది. క్లుప్తీకరిస్తే యేసుప్రభువు 'యేసే రక్షణ కర్త', 'ముక్తిప్రదాత'. క్రీస్తే అభిషిక్తుడు. అధ్యాత్మిక రాజ్యాధినేత అని నిరూపింపబడింది. వెరసి యేసుక్రీస్తు ముక్తి ప్రదాతగా, ప్రభువర్యుడుగా ప్రకటితమయ్యాడు. యేసుస్వామికి త్రియేక దైవం అనే నామాంతరం కూడా ఉంది. మూడు విభాగాలు ఒకే మూర్తిమత్వంలో ఉనికి అయిన ఏకైక దైవం. అయితే యిది త్రిమూర్తుల సిద్ధాంతానికి చెందినది కానే కాదు. భూజనాళి రక్షణార్థమై దేవాది దేవుడే ఆది దైవంగా ఉంటూ, కుమారుడుగాను, పవిత్రాత్ముడుగాను అవనిలో ఆయన రక్షణ ప్రణాళికను పరిపూర్ణం చేసుకుంటాడు. దేవలోకంలో దివినాధుడుగా ఉంటాడు. భూలోకంలో యేసుక్రీస్తుగా ఉదయించాడు. అమరరాజ్యం నుండి పరమాత్ముడుగా దిగి వస్తాడు. అంటే జనకుడు, తనయుడు, పావనాత్ముడు ఈ ముప్వురి ఏకత్వమే త్రియేక దైవత్వం. ఈ త్రిత్వంలో ఒకడైన యేసుక్రీస్తు, మానవుడుగా మన ప్రపంచంలో 33 1/2 సంవత్సరాలు సంచరించాడు. ఆజన్మ బ్రహ్మచర్యం ఆచరించాడు. తన కర్తవ్యాన్ని నెరవేర్చాడు. నాశన త్రోవలో వున్నవారిని వెదకి రక్షించాలని భువిలో వెలిశాడు. దుష్టులను శిక్షిస్తూ, శిష్టులను రక్షిస్తూ వుండాలనే సిద్ధాంతం కాదు, యేసు పాటించింది. శిష్టప్రజాళిని కాపాడడంతో పాటు దుష్టాత్మలకు పశ్చాత్తాప అవకాశాన్నిచ్చి, వారు తప్పులను తెలిసికొని క్షమాభిక్ష కోరితే, గొప్ప కనికరంతో వారిని దగ్గరకు చేర్చుకొని, రక్షణ భాగ్యాన్ని ప్రసాదించి, శిష్టాత్ములుగా అంగీకరించి దేవరాజ్యానికి అర్హులుగా చేయడమే యేసుస్వామి యొక్క జీవితలక్ష్యం. యేసుస్వామిని రక్షకుడుగా, ప్రభువుగా అంగీకరించి, ఆయన ఆదేశం మేరకు నడుచుకునే ప్రతివారికీ ఇహంలో సుఖజీవనం, పరలోకంలో నిత్య జీవం అనుగ్రహించడమే యేసుస్వామి జన్మకారణం. పరమ తండ్రియైన మహాదేవుని ఉద్దేశం, పవిత్రాత్మ ప్రభుని కర్తవ్యం.

మానవ కుమారుడు, దైవకుమారుడు అను మరో రెండు ఉప నామధేయాలున్నాయి. ఆంగ్లంలో 'ద సన్ ఆఫ్ మ్యాన్', 'ద సన్ ఆఫ్ గాడ్' అని అంటారు. ఒకవైపు 'ద సన్ ఆఫ్ మ్యాన్' అంటూ అదే వ్యక్తిని 'ద సన్ ఆఫ్ గాడ్' అనడం ఆశ్చర్యకరంగాను, ఆలోచనా జనకంగాను ఉంది కదా! అంటే ఒకే వ్యక్తి మానవ కుమారుడుగా, దేవుని కుమారుడుగా ఎలా ఉండగలడో విచిత్రం. మానవ కుమారుడు అంటే మానవ మాత్రులైన స్త్రీ పురుషులకు కలిగిన కుమారుడని ధ్వనిస్తుంది. కాని యేసుస్వామి విషయంలో ఈ సామాన్యార్థం వర్తింపదు. మానవ రూపంలో జన్మించాలనుకున్న దైవం, భక్తిప్రపత్తులున్న కన్య మరియ గర్భంలో యేసుస్వామి నామధేయుడుగా ఉద్భవించాడు గనుక మానవ కుమారుడు – అంటే సంపూర్ణ మానవుడుగా జీవించి, జనన మరణాలకు లోనైనాడు. దేవాంశ స్వయం సంభూతుడైనందున, మానవ సహజమైన మరణాన్ని జయించి, 'మృత్యుంజయుడు' అనే విశిష్టాత్మీయ నామాంకితుడయ్యాడీ మానవ కుమారుడ. సర్వోన్నత సర్వేశ్వరుని పవిత్రాత్మ ప్రభావంచేత జగతిపై జన్మించి, దైవకార్యం సాగించి మృత్యుంజయుడైనందున స్వామి యేసు సాక్షాత్తు

దేవ కుమారుడే. ద సన్ ఆఫ్ గాడ్ అని ప్రసిద్ధి గాంచాడు. యేసు స్వామి మానవపాప పరిహారానికి బలియాగమై తన ప్రశస్త రక్త ప్రోక్షణ చేత పరమ జనకుడైన మహాదేవునికి, మానవులకు మధ్య బాంధవ్యం పునర్నిర్మించి, పాప ప్రక్షాళనానికి తగిన మార్గాన్ని వ్యవస్థీకరించాడు.

సిలువలో బలియైన యేసుక్రీస్తు యొక్క పరిత్యాగమే మహాయజ్ఞమ్. ఆ మహాయజ్ఞ ప్రభావమే, సకలలోక ప్రజాళికి సమకూరే సంపూర్ణ సంరక్షణ. ఈ రక్షణ మార్గ ఫలితమే, 'క్రీస్తుశకం' అనే వినూత్న శకం ఉత్పన్నమై అమలులో వుంది.

వివిధ సనాతన వేద, సమంజస శ్లోకార్ధ సహితంగా, ఈ మహాయజ్ఞ ప్రాభవ వాస్తవికతను, సులభగ్రాహ్యం చేసుకుందాం.

'యజ్ఞోనై భవనస్య నాభీః'
ఋగ్వేదం 1:164 : 24

| | | |
|---|---|---|
| యజ్ఞః | = | యజ్ఞం |
| భువనం | = | భూలోకం |
| ఉనై | = | యొక్క (ప్రత్యయం) |
| అస్య | = | మధ్యభాగం (కేంద్రం) |
| నాభీః | = | బొడ్డు (నాభిక) |

శ్లోకార్ధం : 'ప్రాపంచక దేహంలో, యజ్ఞం నాభికగా ఉంది. అంటే ముక్తి పాప్తికి యజ్ఞమ్ ముఖ్యాధారమైంది' అని యజ్ఞోనై భువనస్యనాభీః' శ్లోకం తెలుపుతుంది. సంక్షిప్తంగా తెలుసుకోవాలనుకుంటే భూలోకంలోని ప్రజలందరూ పాప పరిహారార్ధం, ఒక మహా యజ్ఞమ్ చేపట్టాలి. జంతువధ, నరబలి, పాప పరిహారానికి పనికిరానివే. జంతువులు మనిషికి శరీర పోషక పదార్థాలుగా ఉపయోగపడేవే. ఇక మానవ మనస్సులన్నీ, దోష భూయిష్టమైనవి. అవి పవిత్ర యజ్ఞానికి నిరుపయోగమైనవే. సర్వేశ్వరుడు మానవ రూపంలో కన్య మరియ పవిత్ర తనయుడుగా ఈ అవనిలో ఉద్భవించాడు.

భూలోకంలో జన్మించిన వారందరిలో, యేసుక్రీస్తు ఒక్కడే పరమ పవిత్రుడు. ఇది నిర్వివాదాంశం. సకల సృజనం సమ్మతించిన నగ్నసత్యం. కాబట్టి, పాప పరిహారార్ధ యజ్ఞానికి ఏకైక అర్హుడు యేసుక్రీస్తు మాత్రమే. అందుకే - 'ప్రజాపతిర్ధేవేభ్య, ఆత్మానాం యజ్ఞం - కృత్వా ప్రాయశ్చిత్'.

ప్రజాపతిః + దేవేభ్య = ప్రజాపాలకుడైన దేవుడు.

ఆత్మానం = తనను తానే (స్వచ్ఛందంగా)

యజ్ఞం = యజ్ఞముగా

కృత్వాప్రాయశ్చిత్ = ప్రాయశ్చిత్త క్రియార్పణగా (ప్రాయశ్చిత్త పరిహారార్ధముగా)

అర్ధం : ప్రజాపతియైన పరాత్పరుడు (భగవంతుడే) తనను తానే యజ్ఞార్పణగా చేసికొని, ప్రాయశ్చిత్తం నెరవేర్చాడు.

ఆధారం : సామవేదం, తాండియ మహాబ్రాహ్మణం; బంగాళ పత్రం 410, అధ్యాయం 7, ఖండము - 2.

'ప్రజాపతిర్యజ్ఞః' (శతపద బ్రాహ్మణం)

దేవుడే యజ్ఞం అని అర్ధం.

దైవమే యజ్ఞంగా మారినందువల్ల అది 'మహాయజ్ఞమ్' అయింది. ఆ మహాయజ్ఞమ్ ఎలా మోక్ష ప్రదాయకరమైనదో తెలుసుకుందాం.

1. 'స కర్మణా మనుష్టావై ర్ణ దానై
   స్తప పాపినా కైవల్యం లభితే మర్త్యం' (శివగీత)-

అర్ధం : స్నాన, సంధ్య అన్నపానములు, క్షేత్ర, తీర్ధయాదులు దానధర్మాచరణాదుల -

2. పాపినా = పాప భూయిష్టమైన
   మర్త్యం = మానవ జాతికి
   కైవల్యం = మోక్షం
   లభితే = లభించడం
   నః = కానిపని
3. సత్కర్మముల వల్ల పాప పరిహారార్ధమైన పుణ్యంగాని, మోక్షంగాని (ఉప) లభ్యంకావు.
   స కర్మణ = మంచి కర్మములను
   అనుష్టావైర్ణ = అనుష్టించడం వలన
   'సర్వ పాప పరిహారో, రక్తప్రోక్షణ
   మవశ్యం, తద్ రక్తం పరమాత్మేన
   పుణ్య దాన బలియాగం'
   తాండియా మహా బ్రాహ్మణం (సామవేదం)-

(సశేషం)

**పాఠకులకు**
**ఈస్టర్**
**శుభాకాంక్షలు**

# మదర్ తెరీసా

మిషనరీ సిస్టర్‌గా జీవితమంటే కష్టతరమైనదే. ఆమె తన తల్లిని, అక్కను, అన్నను, స్నేహితుల్ని, బంధువుల్ని విడిచి వెళ్ళాలి. ఆమె 16 సం॥లు నిండినప్పుడు రెండు నెలలపాటు ప్రార్థించింది. మరో రెండు సంవత్సరాలు ధ్యానంలో గడిపి తనకు కలిగిన ప్రేరణ నిజమైనదని నిర్ధారించుకుని తన తల్లితో తన నిర్ణయాన్ని చెప్పింది. అప్పుడు తన తల్లి 24 గంటలు తన గదిలోనే ఉంది. బయటకు వచ్చి, 'నా చిట్టితల్లీ, నీ చేతిని దేవుని చేతిలో ఉంచి ఆయనతోనే నీ జీవితాన్ని సాగిస్తూ, క్రీస్తుకు అంకిత మవ్వాలని చెప్పింది'. ఆగ్నెస్ అన్న అయిన లాజర్‌కు ఉత్తరం వ్రాసింది. ఆయన ప్రతిఘటిస్తూ జవాబు వ్రాశాడు. నీవు నీ జీవితాన్ని అగాధంలో పడవేసుకుంటావా అని కోపంగా వ్రాశాడు. ఆగ్నెస్ కోపంతో తన అన్నకు జవాబు వ్రాస్తూ, నీవు నీ రాజుకు, రెండు మిలియన్ల ఆల్బేనియా ప్రజలకు సైనికాధికారిగా సేవ చేస్తున్నానని అనుకుంటున్నావు. కాని, నేను సర్వలోకానికి రాజైన యేసుప్రభువు సేవకు వెళుతున్నానని వ్రాసింది. ఆ విధమైన జవాబు చదివిన తరువాత లాజర్ తన అభిప్రాయాన్ని మార్చుకున్నాడు.

దేవుని పిలుపు మేరకు మదర్ తెరీసా తన పరిచర్యను మొదలుపెట్టిన విధానాన్ని చూదాం. పాపంతో నిండియున్న ఈ ప్రపంచాన్ని పవిత్రపరచడానికి యేసుప్రభువు మానవునిగా జన్మించి, సాతాను కబంధ హస్తాలలో చిక్కుకొని పోయిన పాపాత్ములకు విముక్తిని ప్రసాదిస్తూ దైవప్రేమను, క్షమా గుణాన్ని లోకానికి చూపెట్టిన యేసుప్రభువు మాటలు గైకొనుటకు ఆగ్నెస్ నిర్ణయం తీసుకుంది. 'నన్ను వెంబడించ గోరువాడు తన్ను తాను ఉపేక్షించుకొని, ప్రతిదినము తన సిలువనెత్తుకొని నన్ను వెంబడించవలెను' (లూకా 9:23).

క్రీస్తు ప్రతినిధిగా, ప్రేమాభరితమైన ఆయన దివ్య రాజ్యాన్ని వివరించే రాయబారిగా, విశ్వప్రేమను చూపించే సేవికగా తన జీవితం పండిపోవాలన్న అచంచలమైన సంకల్పం ఆగ్నెస్‌ను విదేశానికి సిద్ధంచేసింది. 'లొరెంటో మఠకన్యల' కేంద్రస్థానం ఐర్లాండ్ దేశంలోని డబ్లిన్ నగరంలో ఉంది. అక్కడ వున్న మదర్ జనరల్‌తో ఇంటర్వ్యూ అయిన తరువాత అక్కడ కొంతకాలం మఠ జీవితానికి సంబంధించిన ప్రాథమిక సూత్రాలు, ఇంగ్లీషు భాష నేర్పి భారతదేశానికి పంపాలని నిర్ణయించారు. సెప్టెంబరు 25, 1928 రాత్రి చర్చిలో ఆమెకై వీడ్కోలు సభ ఏర్పాటు చేయబడింది. మరుసటి రోజు రైల్వేస్టేషన్‌లో సుమారు 100 మంది ఆమెకు వీడ్కోలు చెప్పారు. ఆనాటి ప్రయాణంలో తన తల్లి, అక్క తనతో రైలులో ప్రయాణమయ్యారు. తన స్నేహితుల్ని, సంఘములోని వారిని విడిచి వచ్చేటప్పుడు తను బాధతో వారికి వీడ్కోలు చెప్పింది. ఆగ్నెస్ వెళ్లినప్పుడు కాథలిక్ మిషన్స్ అనే పత్రికలో ఇలా వ్రాయబడింది. 'పరిశుద్ధుడైన పేతురు వెంటనే తన వలలను విడిచి ప్రభువును వెంబడించిన రీతిగా ఆగ్నెస్ తన పుస్తకము లను వదలి దేవుని వెంబడించుటకు సిద్ధపడింది. ప్రతి ఒక్కరు ఆశ్చర్యపడ్డారు. ఎందుకంటే క్లాసులో ఆమే ఫస్ట్. అందరి మన్ననలు పొందేది. అందరితో పొగడబడేది. చర్చి బాలికలం దరిలో ముందుంటూ పాటలు పాడుటలో ఆమెలేని లోటు తీరనిది మరియు పూడ్చలేనిది. ఆమె వెళ్ళేటప్పుడు ఆమెకు వీడ్కోలు చెప్పటానికి వచ్చిన వారంతా కంటనీరు పెట్టు కున్నారు'. అంత చిన్న వయసులో ఎంత మంచి అభిమానాన్ని సంపాదించుకుంది.

అక్కడ నుండి ఆగ్నెస్ తల్లి, అక్కతో జాగ్రెబ్ అనే పట్టణంలో మూరు వారాలు వుంది. లొరెటో సిస్టర్స్ సంస్థలో చేరటానికి యుగోస్లావియా దేశానికి చెందిన 'బెటికా' అనే మరో అమ్మాయి ఆగ్నెస్‌తో కలవనుంది. వారిద్దరూ ఆస్ట్రియా, స్విట్జర్లాండు గుండా ఫ్రాన్సు దేశానికి వెళ్లి అక్కడ నుండి లండన్ చేరుకుని ఐర్లాండు దేశములోని డబ్లిన్ వరకు ఓడలో ప్రయాణమయ్యారు. ఆగ్నెస్ తన తల్లికి, అక్కకు వీడ్కోలు చెప్పింది. ఆనాడు విడిపోయిన ఆమె తల్లి, అక్కలను వారి జీవితకాలములో చూచుకొనే అవకాశం ఉండదని వారికారోజు తెలియదు. ఆగ్నెస్ తల్లి 1972లోను, అక్క 1974లోను చనిపోయారు. వారు ఉత్తరాల్లో ప్రస్తావిస్తూ ఆగ్నెస్ తల్లి ఈ లోకంలో జీవించగా చూచుకొనక పోయినా యేసుప్రభువు సమక్షంలో కలుసుకుని ఆనందిస్తాము అనే నిరీక్షణ కలిగి

వున్నట్లు వ్రాసేవారు. 1910లో అగ్నెస్ పుట్టిన దగ్గర్నుండి ఆమె తల్లి ఆమెను నడిపించి ముందుకు తీసుకుని వచ్చింది. కాని ఇప్పుడు అగ్నెస్ తనంతట తానుగా జీవించాలి.

అగ్నెస్, బెటికా డబ్లిన్ నగరం చేరగానే మదర్ సుపీరియర్, మరిద్దరు లొరెటో సిస్టర్స్ వారిని కలుసుకున్నారు. మదర్ సుపీరియర్ ఇంటర్వ్యూ అయిన తరువాత వారి శిక్షణ మొదలైంది. ఇండియాలో ఉండి వచ్చిన మదర్ యం.బోర్గియా ఇర్విన్ ఇంగ్లీషు బోధించుటకు నియమించబడ్డారు. ఒకరోజు మదర్ ఇర్విన్ అగ్నెస్ విషయంలో ఈ క్రింది విధంగా ఆలోచిస్తుంటే అగ్నెస్ గమనించింది. ఈ గోన్‌షా బొయావు అగ్నెస్ ఇంత చిన్నగా పీలగా వుంది. ఈమె కష్టపడి పని చేయగలదా? ఈమె తన అభిప్రాయాన్ని అలాగే పట్టుకుని ఉంటుందా? కక్షపెట్టుకోకుండా ఉండగలదా? గట్టిగా నిలబడగలదా? ఈమె తప్పుల్ని పెద్దగా చేస్తుందా? లేక వాటిని తేలిగ్గా విసరి పారేయగలదా? అందరితో కలసి మెలసి వుండగలదా? అందరితో ఆనందంగా గడపగలదా? ఇప్పుడే మొదలైంది, ఇంకా చాలా దూరం వెళ్ళాలని, ముందు ముందు ఎంతో నేర్చుకోవాలిగదా అనుకుంది. ఆమె పై విధంగా అనుకున్నవన్నీ అగ్నెస్ పసికట్టింది. దేవునికి కృతజ్ఞతా స్తుతులు చెల్లించి అదే ప్రార్థన ఇంగ్లీషులో చేయడానికి ప్రయత్నించింది.

ఎంతో విశ్వాసంతో ప్రార్థన చేశారో – అగ్నెస్, బెటికాలు ఇండియాకు వెళుతున్నారు. నవంబరు 1929 రెండవ వారంలో వారి ప్రయాణం ఓడలో ప్రారంభమైంది. సముద్ర ప్రయాణం చాలా కష్టతరమైనది. ఆరు వారాలకు శ్రీలంక దేశంలోని కొలంబో నగరానికి చేరుకున్నారు. అక్కడ నుండి మద్రాసు నగరానికి వచ్చారు. ఇండియా దేశంలో వారు కాలుమోపారు. ఎక్కడ చూసినా పేదరికం. అగ్నెస్ తన జీవతంలో ఎన్నడూ ఊహించని పేదరికాన్ని చూసింది. జనవరి 6, 1929న వారు కలకత్తా నగరానికి చేరారు. అగ్నెస్ తను అనుకున్న బెంగాల్ ప్రావిన్స్‌కు చేరుకుంది. లొరిటో సిస్టర్స్ వారిని కలకత్తాలోని లొరిటో కాన్వెంట్‌కు తీసుకొచ్చారు. వారక్కడ చర్చికి వెళ్లి సురక్షితమైన ప్రయాణము దయచేసినందుకు యేసుప్రభువుకు కృతజ్ఞతా స్తుతులు చెల్లించారు. వారక్కడ వారం రోజులుండి డార్జిలింగ్‌కు బయలుదేరారు. క్రిక్కిరిసి అల్లరిగా వున్న రైలు మూడవ తరగతి పెట్టెలో ప్రయాణిస్తున్నారు. రైల్లో కొందరు వీరిని చూసి మీరు ఎక్కడ నుండి వచ్చారు? ఎక్కడకు వెళ్తున్నారు? మీరు వేసుకున్న బట్టలు చాలా బాగున్నాయి అని సంభాషిస్తుంటే అగ్నెస్‌కు యోహాను సువార్తలోని 1:47 వాక్యం గుర్తుకు వచ్చింది. యేసుప్రభువు నతనియేలు తన వద్దకు వచ్చుట చూచి ఇదిగో యితడు నిజముగా ఇశ్రాయేలీయుడు, ఇతనియందు ఏ కపటమును లేదని అతని గూర్చి చెప్పెను. అదేవిధంగా అగ్నెస్ తనతో ఎంతో కుతూహలంగా ప్రయాణిస్తున్న భారతీయులను చూసి అనుకుంది, వారియందు ఏ కపటము లేదని. ఎంతటి సంతోషము. ఎంతగొప్ప భాగ్యమును ప్రసాదించిన దేవునికి వందనములు అనుకున్నది. ఇండియాకు కలకత్తా రాజధానిగా 1912 వరకు ఉన్నప్పుడు, డార్జిలింగ్ వేసవి రాజధానిగా వుండేది. అందువల్లనే డార్జిలింగ్‌లో ఎన్నో యూరోపియన్ కట్టడాలున్నాయి. ఢిల్లి రాజధాని అయిన తరువాత బ్రిటీషువారు సిమ్లాను వేసవి రాజధానిగా చేసుకున్నారు.

క్రొత్తగా చేరిన సిస్టర్స్ మతపరమైన రోజు వారి జీవితమును గురించి నేర్చుకున్నారు. వారికి లేఖనాలు గురించి, ప్రార్థన గురించి లొరిటో సంస్థ గురించి, ఆ సంస్థలోని కొందరు సెయింట్స్ జీవితాలు గురించి బోధించారు. 1609లో మేరివార్డ్ అనే ఇంగ్లీషు యువతి జసూట్ ఫాదర్స్ సంస్థ ది సొసైటీ ఆఫ్ జీసస్ రూల్స్ ప్రకారము తన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ది బ్లెస్డ్ వర్జిన్ మేరి అనే సంస్థను స్థాపించారు. కాన్వెంట్‌లో కూర్చుని ఉండకుండా నాలుగు గోడలను దాటి పేదవారికి సేవచేయడం ముఖ్య ఉద్దేశమై యున్నది. మేరివార్డ్ సమాధిపై ఈ విధంగా వ్రాశారు. "To love the poor, perserve in the same, Live, Die and Rise with them" ఈ మాటలు అగ్నెస్ హృదయాన్ని జయించాయి. అగ్నెస్ తల్లి కూడ అలాగే చెప్పేది.

1924, మే 24న తేదిన తమ ప్రథమ మఠ వాగ్దానాలు చేయాలి. అది ప్రమాణ స్వీకారం చేయడము. ఒక్కసారి ఈ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత ఆ జీవితానికి కట్టుబడి ఉండాలి. ఈ దశలో అటువంటి కఠోరమైన జీవితానికి భయపడేవాళ్ళు మఠం నుంచి ఇంటికి వెళ్ళిపోవచ్చు. నిర్బంధం ఏమీలేదు. అయితే అగ్నేస్‌కు అలాంటి జీవితమంటే భయములేదు కదా సంతోషదాయకం. మనసారా ఆశించిన జీవితం. వాగ్దానాలు చేసేటప్పుడు ఒక ముఖ్యమైన నిర్ణయమేమంటే వారికి ఇష్టమైన పేరు వారికి వారే నిర్ణయించుకోవాలి.

(సశేషం)

# విశ్వాసంలో ఓ మెట్టు



'-అమ్మా, మీరు పంపిన చెక్కుకు, మీ ఉత్తరానికి నా వందనాలు. నన్ను గవర్నమెంటువారు వారిష్టప్రకారం బదిలీ చేశారు. కనుక నా సామాను ఈ ఊరు తేవటానికి అయ్యే ఖర్చు వారే చెల్లించారు. అంతేకాక ప్రతి సంవత్సరం నా జీతం పెరుగుతుంటుంది. మీ పెద్ద కుమారుడు స్టడ్ ఆఫ్రికాలో దేవుని సేవ చేస్తున్నాడు. నేను దేవుని సేవ చెయ్యటం లేదు. కనుక ప్రతినెల 25 డాలర్లు నాకు పంపించేకంటే మీ పెద్ద కుమారునికి పంపిస్తే ఆయనకి చాల ఆదరణకరంగా వుంటుంది' అని వ్రాశాడు.

దానికి జవాబుగా అమెరికా నుండి ఈ విధంగా వ్రాసింది. 'ప్రియమైన కుమారుడు సామ్యేలుకు -ముండీస్ దంపతులు వ్రాయుట. నీవు ఇక్కడ మమ్ములను చూచిన విధముగా మేము గవర్నమెంటు వారిచ్చే పెన్షన్ మీద బ్రతుకుతున్నాం. అందులో దశమభాగం ఎవరికి పంపాలి అని ప్రభువును ప్రార్థించినప్పుడు నీ పేరు నేను, నా భర్త స్పష్టంగా విన్నాము. అందునుబట్టి ఆ డబ్బును నీకు ప్రతినెల పంపించా లని తీర్మానించుకున్నాం. ఇది దేవుని చిత్తమైనప్పుడు వద్దని నీవు చెప్పటం మంచిది కాదు' అని వ్రాశారు. అప్పటి నుండి ఆమె ప్రతినెల మొదటి తారీఖుకు అందేటట్లు నెలకు 35 డాలర్లు అంటే నాలుగు వందల డెబ్బయి అయిదు రూపాయలు పంపించటం ప్రారంభించింది.

సామ్యేలు చదువుకున్న డ్రైవరే కాకుండా అమెరికా వెళ్లి వచ్చిన డ్రైవరు. అమెరికా సహాయం పొందుతున్న డ్రైవరుగా కనిగిరిలో అందరికి తెలిసిపోయింది. క్రైస్తవులలో అనేకమంది సామ్యేలు దగ్గరి వచ్చి అమెరికాలో మీకు తెలిసిన అడ్రసులు ఇవ్వండి అని అడగటం ప్రారంభించారు. అడిగిన వారందరికి తన స్నేహితుల అడ్రసులు ఇచ్చాడు సామ్యేలు. తరువాత ఏమయిందో వారిని ఎన్నడూ అడగలేదు, సామ్యేలు అమెరికాలో మరెవ్వరికీ ఉత్తరాలు వ్రాయనూలేదు.

పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. ఖర్చు పెరుగుతుంది. అమెరికా డబ్బులు, పుష్ప పెన్షన్ కూడ సరిపోవటం లేదు. బైబిలు చినిగిపోయింది. బైబిలును బాగుచేసుకోవాలి. అంటే బైండింగ్ చేసుకోవాలి. ఇతరుల పుస్తకాలు ఎన్నో బాగు చేశాడు. కనిగిరిలో భక్తసింగ్ సహవాసం పాస్టరు అడగకపోయినా అతని బైబిలు సెక్షన్ కుట్టి ఇచ్చాడు. మీ బైబిలు బాగుచేసికోరా! అన్నది భార్య. అలా అంటూనే వుంది. 'నేనేమైనా బైబిల్ పట్టుకొని చర్చికి వెళ్తానా, ఇంట్లో చదువుకొనే బైబిలు ఎలా వుంటే ఏమి?' అని ఊరుకున్నాడు.

చివరికి విసికిపోయి ఓరోజు కూర్చుని బైబిలు అంతా విడదీసి సెక్షన్ కుట్టుకొని, కటింగ్ చేయించుకోడానికి కృష్ణా ప్రెస్‌కి వెళ్ళాడు. సెక్షన్ కుట్టుకుట్టిన బైబిల్‌ను చూసి ప్రెస్ ఓనర్ అజయ్‌రెడ్డి 'ఈ సెక్షన్‌కుట్టు ఎవరు కుట్టారు?' అన్నాడు. 'నేనే' అన్నాడు సామ్యేలు. 'మీరేం చేస్తారు' అన్నాడు. 'అంబులెన్స్ డ్రైవర్' అన్నాడు సామ్యేల్. 'మీది ఏవూరు?' అన్నాడు ప్రెస్ ఓనర్. 'ఒంగోలు' అన్నాడు సామ్యేలు.

'మీకు స్టేషన్ దగ్గర చర్చి సామ్యేలుగారు తెలుసా? ఆయనకు మూడు కార్లు ఉన్నాయి' అన్నాడు ఆయన. 'ఇంకా కొన్ని వివరాలు చెప్పండి' అన్నాడు సామ్యేలు. 'ఆయన అమెరికా వెళ్ళి వచ్చాడు. ఒంగోలులో ఆయనకి మంచి పలుకుబడి ఉంది. మీకు తెలియకపోవడం ఏమిటి?' అన్నాడు అజయ్‌రెడ్డి.

'సామ్యేలు మీకెలా తెలుసు?' అన్నాడు సామ్యేలు. 'మా బంధువు డా॥ నారాయణరెడ్డి డెంటల్ హాస్పిటల్ పెట్టినప్పుడు సామ్యేల్‌గారు చాలా సహాయం చేశాడు. వాళ్ళిద్దరూ మంచి ఫ్రెండ్సు. సామ్యేలుగారు అమెరికా వెళ్ళేటప్పుడు నేను కూడ స్టేషన్‌కి వెళ్ళాను' అన్నాడు అజయ్‌రెడ్డి. 'మీరు నాకు గుర్తురావటం లేదండీ' అన్నాడు సామ్యేలు. 'నన్ను మీరెప్పుడూ చూడలేదు కదా' అన్నాడు అజయ్‌రెడ్డి. 'నేనే ఆ సామ్యేలుని' అన్నాడు సామ్యేలు.

అజయ్ ఆశ్చర్యపోయాడు. 'నో.. నో.. మీరు కాదు అని సామ్యేలు ముఖంలోకి తీక్షణంగా చూసి నో.. నో.. ఒకవేళ మీ బ్రదర్ అయ్యుండొచ్చు. ఏంటయ్యా నేనేమైనా పిచ్చివాడనా' అన్నాడు. 'లేదు నేనే ఆ సామ్యేలుని, ఆ నారాయణరెడ్డి ఫ్రెండ్‌ని, ఆయన భార్య పేరు రాజేశ్వరి, తండ్రిపేరు చిన్నప్పరెడ్డి. వారి ఊరు దొడ్డిచింతల' అన్నాడు సామ్యేలు. అయినా అజయ్‌రెడ్డి కొంచెమైనా సమ్మతించలేదు.

'సామ్యేలు నా అరచేయంత తెల్లగా వుంటాడు. ఎప్పుడూ సరదాగా వుంటాడు' అని ఇంకా ఏదో అనబోతుంటే 'ఎప్పుడూ సేవించి వుంటాడు' అన్నాడు సామ్యేలు.'యస్...యస్... మేమిద్దరం కలిసి తీసుకున్నాము' అన్నాడు అజయ్. మెల్లగా ఈ సామ్యేలు ఆ సామ్యేలే అన్న నిర్ణయానికి వస్తున్నాడు. 'మీకు ఇద్దరు డ్రైవర్లు వుంటే మీరు డ్రైవరు అవ్వటం ఏమిటి?' అన్నాడు.

'అవన్నీ మా ఫాదర్‌కి వున్నాయి నాకు కాదు' అన్నాడు సామ్యేలు. అజయ్ ఆలోచనలో పడ్డాడు. 'అయినా డ్రైవరు ఉద్యోగం ఎందుకు చెయ్యాలి' అన్నాడు. 'నేను చెయ్యాలని

అనుకోలేదు, కాని ఆఫీసర్ల మోసం నా భార్య స్టాఫ్‌నర్స్‌గా చనిపోవటంతో జీవితం తిరిగిన మలుపు' అన్నాడు సామ్యేలు.

ఇప్పుడు పూరిగా నవ్వేడు అజయ్. కూర్చుని చాలాసేపు మాట్లాడుకున్న తర్వాత 'మాకు కటింగ్ మిషన్ లేదు, ప్రక్కన నేతాజీ ప్రెస్‌లో వున్నది. బాలకృష్ణారెడ్డి, బి.కాం' అన్నాడు. 'బి.కాం. చదివి ప్రింటింగ్ ప్రెస్ ఎందుకు పెట్టాడు?' అన్నాడు సామ్యేలు.

'రేపు ఉదయం రండి. మనం అక్కడకి వెళ్దాము. మీరే మాట్లాడండి' అన్నాడు అజయ్. ప్రెస్‌లో ఒక మూల కట్టకట్టివున్న పుస్తకాలు చూసి 'అవి ఏంటి' అన్నాడు సామ్యేలు. 'అవన్నీ లా జర్నల్స్, నన్ను బైండింగ్ చెయ్యమని పోలిరెడ్డిగారు ఇచ్చారు. సంవత్సరం అయింది. బైండర్ దొరకలేదు. అవన్నీ మీరు బైండింగ్ చెయ్యవచ్చు. మీకు చేతినిండా పని, కావలసినంత డబ్బు' అని ప్రెస్ మూస్తూ 'పదండి ఏమైనా తీసుకుందాం' అంటూ బ్రాందీషాపువైపు కదిలారు ఇద్దరూ.

మరుసటిరోజు ఉదయం రిజిష్టరు సంతకం చేసి నేతాజీ ప్రెస్‌కి బైబిలు చేతిలో పెట్టుకొని వెళ్ళాడు. తెల్లని ఇస్త్రీ పంచ, తెల్లని షర్టు, కళ్ళద్దాలు, చేతిలో సిగరెట్టు, దర్జాగా కూర్చుని వున్న 55 సంవత్సరాల వ్యక్తిని చూసి 'నమస్కారమండి' అన్నాడు సామ్యేలు.

ఆయన సామ్యేలును పరీక్షగా చూసి చేతిలోవున్న బైబిలు చూసి 'కటింగా?' అన్నాడు. 'అవును' అన్నాడు సామ్యేలు. 'చేసికొంటారా' అన్నాడు. తలూపాడు సామ్యేలు. 'చేసికో' అన్నాడు. బైబిలు కటింగ్ చేసి ఓ రూపాయి ఆయన చేతిలో పెడితే 'అర్ధరూపాయి చాలు' అన్నాడు.

ఈయన బి.కాం. చదివాడా? అని అనుకుంటూ వెళ్ళి పోవడానికి వెనుదిరగంగానే ఎక్కడో దూరం నుండి వచ్చిన గొంతు, సరిగ్గా వినబడని స్వరం, 30 ఏళ్ళ వ్యక్తి సన్నగా పొడుగ్గా, చేతుల బన్నీను, లుంగీ, మాసినగడ్డం 'పుస్తకం మీరే కుట్టారా?' అని సామ్యేలు చేతిలో పుస్తకం అడిగాడు. 'బైబిలు' అంటూ ఆయన చేతికిచ్చాడు.

'సుబ్బారెడ్డిగారు సెక్షన్ బాగుంది కదా' అని తెల్లగుడ్డల ఆసామిని అడిగి లోనికి వెళ్ళాడు. 'బాగుందండీ' అని సుబ్బారెడ్డిగారు సామ్యేలు వివరాలు అడిగాడు. 'ప్రెస్‌లో ఏదైనా పని వుంటుందా?' అని సుబ్బారెడ్డిగారిని అడిగాడు సామ్యేలు చిన్నగా. 'పనా? ఇక్కడ ఏం పని ఉంటుందండీ. ఇది పట్టణం కాదు పల్లె కాదు, మాకు సరిపోయే పని వుంది' అన్నాడు.

సామ్యేలు ఇంటికి వచ్చాడు. ఇంతకీ ప్రెస్ ప్రొప్రయిటర్ బాలకృష్ణారెడ్డిని చూడనే లేదుగా అనుకుని బైబిలు ఇంట్లో పెట్టి మరలా సాయంకాలం ప్రెస్ దగ్గరకు వెళ్ళాడు. లుంగీ, చేతుల బన్నీను, మాసిన గడ్డం వ్యక్తి ఒక్కడే లోపల కంపోజ్ చేస్తున్నాడు. సామ్యేలును పలకరింపుగా చూసి మరలా పని చేసుకుంటు న్నాడు. ఆయన చూపులో ఆహ్వానం ఉన్నదో, ఛీ పో అన్నట్లు ఉందో సామ్యేలుకు అర్థం కాలేదు. ఆయన ఏదో మాట్లాడేడు. అది ఆయనకైనా వినబడిందో లేదో ఇక సామ్యేలుకు ఎలా వినబడుతుంది. 'మీ ప్రొప్రయిటర్ ఎక్కడ వుంటారు' అని అడగబోయేంతలో బయట నుండి ఒక పెద్దాయన 'బాలకృష్ణా' అని పిలిచాడు.

సామ్యేలు ఆశ్చర్యపోయాడు. ఈయనే బాలకృష్ణారెడ్డి ప్రొప్రయిటరా? అనుకున్నాడు. ఆయన ధోరణిలో ఆయన ఉన్నాడు. అదో క్రొత్త ప్రపంచంలో విహరిస్తున్నాడా? ఆ లోకంలో నుండి ఈ లోకంలో ఈ ప్రెస్ దగ్గరకు వచ్చి మీరెవరు? ఈ వూరు ఎందుకు వచ్చారు? అని అడిగితే బాగుండును అను కున్నాడు సామ్యేలు. చూట్టానికి చిన్నవాడే, చదువుకున్నవాడే. అయినా పలకరించని వానితో ఏమి పని అవుతుంది? అను కుంటూ బాలకృష్ణ వైపు చూశాడు. హమ్మయ్య! చేతిలో స్టిక్ ప్రక్కన పెట్టి శబ్దం రాని నవ్వుతో దగ్గరగా వచ్చి 'కూర్చో' అన్నాడు బొత్తిగా మర్యాద తెలియదే అనుకున్నాడు సామ్యేలు. ఈయనతో పని తెమిలేది కాదులే అని ఏదో రెండు మాటలు మాట్లాడి ఇంటికి వచ్చాడు సామ్యేలు.

ఊరి బయట పామూరు వెళ్ళే రోడ్డులో చివరి ఇల్లు అదే. ఒకరోజు ఉదయాన్నే ఇంటి దొడ్డి తలుపు తెరిస్తే ఐదడుగల పాము కనిపించింది. నోటమాట రాలేదు. కళ్ళప్పగించి చూస్తున్నాడు సామ్యేలు. ఆ పాము తన దారిని అది పోయింది. ఇల్లు ఖాళీ చేయాలని అనుకున్నాడు. ఇంట్లో భార్యాపిల్లలకు చెప్తే భయపడతారని చెప్పలేదు.

1964లో వివాహమైన వెంటనే క్రొత్తపట్నం, దేవుడి తోటలో కాపురం పెట్టి అనాధశరణాలయం పెట్టినప్పుడు తనున్న ఇంటి ద్వారబంధము దగ్గర తెల్ల త్రాచుపాము నిలిచి పడగ విప్పి ఆడి తాటాకుల తడిక గోడలో దూరిపోయింది. ఇంక దానిని పట్టటం అసాధ్యం అన్నారు. దానంతట అది వెళ్ళిపోతేనే కాని దాని నుండి తప్పించుకోవాలంటే ఇల్లు ఖాళీ చెయ్యాలి. విష జంతువును చూసి పారిపోయిన దైవజనునిగా ఆ యానాది వారి మధ్యలో సేవ ఎలా చెయ్యాలి. కనుక ఇల్లు ఖాళీ చెయ్యక అక్కడే వుండిపోయాడు సామ్యేలు. తన దగ్గర చేరిన తొమ్మిది మంది పిల్లలు తనతో కలిసి ఆ గదిలోనే నేల మీద నిద్రించే వారు. రాత్రి వేళల్లో అప్పుడప్పుడు పాము బుస అది కదిలి వెళ్ళే శబ్దం వినిపించేది. తన చేతిలో బ్యాటరీ లైటు ఉన్నా దానిని ఉపయోగించేవాడు కాదు. అలా ఆరు నెలలు గడచిన తర్వాత ఆ యింటికి నిప్పు అంటుకొని కాలిపోయినప్పుడు ఆ పాము కూడా అందులో కాలి చనిపోయి క్రిందపడింది.

(సశేషం)

క్విజ్ **40**

# మార్చి నెల ప్రశ్న ?

పాఠకులను వాక్యపు జ్ఞానంలో పెంచటమే ఈ శీర్షిక ఉద్దేశ్యం.

1. నోవహు ఎన్ని దినములు ఓడలో వుండెను?
2. మోషే సీనాయి పర్వతముపై దేవునితో ఎన్నిసార్లు మాట్లాడెను?

**ఫిబ్రవరి నెల ప్రశ్నకు జవాబులు కరెక్టుగా వ్రాసి పంపిన వారు :**
**శ్రీమతి పి.జె. సత్యవాణి, తెనాలి**
**శ్రీ బి.ఎ.లాజరస్, నిడదవోలు**
**శ్రీమతి బత్తుల ఆనీమేరి, హైదరాబాద్**
**శ్రీమతి సత్యవతి జాకబ్, నెల్లూరు**
**ప్రయత్నించినవారు :**
**కుమారి నమ్రత, కావలి - జ్యోతి, నల్గొండ**

## కొడవటికంటి నవలలు

1. మడిమెను పట్టుకొనినవాడు
2. జప్నత్పనేహు
3. ఆసెనతు
4. అపొస్తలుడు
5. బర్నబా
6. తిమోతి
7. నా చిత్తానుసారుడు
8. గుంట నుండి మింటికి
9. నా స్నేహితుడు
10. తోటలో పనివాడు
11. గోత్రకర్త
12. విశ్వాసంలో ఓ మెట్టు *
13. నా దూత *
14. సువార్తలలోని యేసు *

పై రచనలు అన్ని ప్రముఖ క్రైస్తవ పుస్తకశాలలలో, పబ్లిషర్స్ వద్ద లభించును.

* మూడు పత్రికలలో సీరియల్స్‌గా వచ్చుచున్నవి.

**ఈ నెల పోషకులు :**

| | | |
|---|---|---|
| రెవ.డా॥కె.జోసఫ్, ఐ.ఇ.ఆర్.యఫ్ | ఒంగోలు | 1000 |
| డా॥ పి. హుస్సేనయ్య | బేస్తవారిపేట | 1000 |
| రెవ. డా॥ యం.యస్.శాంతవర్ధన్ | గుంటూరు | 1000 |
| శ్రీ యడవల్లి ప్రసాదరావు | హైదరాబాద్ | 1000 |
| శ్రీ బొకినాల ఇశ్రాయేలు | విజయవాడ | 1000 |
| శ్రీమతి పి. దోరతి రవివర్మ | హైదరాబాద్ | 1000 |
| కుమారి హేనాప్రతిభ | హైదరాబాద్ | 500 |
| శ్రీ సి. హెచ్. సాల్మన్‌రాజు | నర్సరావుపేట | 500 |
| రెవ. డా॥ బి.వి.ఎబినెజరు | హైదరాబాద్ | 500 |
| టి.ఎఫ్.సి. సునీత్‌కుమార్ | సికింద్రాబాద్ | 500 |
| శ్రీమతి పద్మాడానియేల్ | హైదారాబాద్ | 500 |
| శ్రీ జస్వంత్‌లాల్ | హైదరాబాద్ | 500 |
| శ్రీమతి రనితాజ్ఞానకుమార్ | హైదరాబాద్ | 500 |
| శ్రీ జంగాల ఆనంద్ | ఒంగోలు | 400 |
| శ్రీమతి రూతమ్మ | బాపట్ల | 200 |
| శ్రీ చీమకుర్తి జాన్ వెంకటేశ్వర్లు | ఒంగోలు | 200 |
| శ్రీ యం. యేసుదాసు | హైదరాబాద్ | 150 |
| శ్రీ మాథ్యూస్ | ఒంగోలు | 150 |

## పాఠకుల వేదిక

నేను, నా కుటుంబం ప్రతిరోజు ఉదయం, సాయంత్రం, రాత్రి బైబిల్ చదువుతాము. డిసెంబర్ 31కి ప్రకటన 22 అధ్యాయం పూర్తిచేస్తాము. మీరు ప్రతినెల మేగజైన్‌లో క్విజ్ క్వశ్చన్స్ చాలా ఆసక్తిగా ఉంటున్నాయి. జూలై నుంచి అన్ని ప్రశ్నలకి జవాబులు రాసుకున్నాను. కానీ నవంబర్‌లో ఇచ్చిన మొదటి ప్రశ్నకి సామెతలు 16 అనుకున్నాను. వచనమే నాకు కష్టమైంది. అప్పటినుండి నేను బైబిల్ ఇంకా బాగా చదవాలి అనుకున్నాను. ఇంకా న్యూస్ ద్వారా కూడా చాలా విషయాలు తెలుసుకుంటున్నాను. నిజంగా మీ పత్రిక చాలా ఆత్మీయంగా, యధార్థతతో జీవించులాగున మమ్మును నడిపిస్తుంది. అందుకు మీకు హృదయపూర్వక ధన్యవాదములు.

**ఇట్లు, జక్కం సోఫియారాజ్, హైదరాబాద్.**

మీరు పత్రిక పంపడం వలన ఆధ్యాత్మికంగా ఎంతో ఎదుగు తున్నాము. పత్రిక పంపుతున్నందుకు మీకు కృతజ్ఞతలు తెలుపుచున్నాము.

**ఇట్లు, వి.జ్యోతి, నల్గొండ.**

సాక్ష్యము

# ప్రభువు కృపవలన

1954లో నేను ఎ.బి.యం. హైస్కూలులో 9వ తరగతి చదువుతున్నాను. మా తల్లిదండ్రులు రామాయపట్నంలో సెమినరీ చదువుతున్నందున నన్ను హాస్టల్లో చేర్పించారు. ఆ రోజుల్లో హైస్కూలు గ్రౌండ్సులో సాయంకాలం మూడు బ్యాచెస్ ఫుట్‌బాల్ ఆట ఆడుతుండేవారు. అప్పట్లో క్రికెట్ పేరు తెలియని వారు చాలమంది వున్నారు.

ఒకరోజు నేను ఫుట్‌బాల్ ఆట ఆడుతుండగా నా కుడికాలు పరుగెత్తుటకు సహకరించటం లేదని గమనించాను. కాలులో కాని పాదములో కాని ఏమీ నొప్పి లేదు. మిషన్ హాస్పిటల్‌కి వెళ్తే ఎక్స్‌రే తీసి గిలక లోపల ఒక ఎముక చిట్లింది అని పిండికట్టు కట్టారు. రెండు నెలలు కట్టు మీదనే నడుస్తూ బడికి వెళ్తున్నాను. రెండు నెలల తర్వాత కట్టు విప్పదీశారు. వెంటనే పాదము గిలకలు మోకాలు వరకు ఉబ్బిపోయినది. పాదము నేలకు ఆనిస్తే గిలకలో విపరీతమైన నొప్పి కలిగేది. 11 నెలలు మిషన్ హాస్పిటల్లోనే ఉన్నాను. అయినా ఏ మాత్రం బాగుకాలేదు.

తరువాత ఇంటికి వచ్చి కుడికాలు పైకెత్తి రెండు చేతులతో కర్ర పట్టుకుని నడవసాగాను. తర్వాత పుత్తూరు రాజుల శల్య చికిత్స వద్దకు వెళ్ళాను వాళ్ళు వారానికి ఒక కట్టు చొప్పున కుడికాలు గిలకకి కోడిగ్రుడ్డు కట్టు ఆరునెలలు వేశారు. కాని ఫలితంలేదు. ఇంతలో అమెరికా నుండి బ్రేస్టడ్ అనే డాక్టరుగారు మిషన్ హాస్పిటల్‌కు వచ్చారని మరలా హాస్పిటల్లో అడ్మిట్ అయ్యాను. ఆయన నాకు బోన్ టి.బి. (ఎముక క్షయ) వచ్చింది అని తేల్చి మూడు నెలలు ట్రీట్‌మెంట్ ఇచ్చారు. చివరకు రాయవేలూరు హాస్పిటల్‌కి వెళ్ళమన్నారు.

రాయవేలూరు బయలుదేరి మద్రాసులో దిగి మా అక్క (పెదనాన్న కూతురు) పిడతల కమలమ్మగారు మద్రాసులో ఉద్యోగం చేస్తున్నందున ఆమె వద్దకు వచ్చాము. మద్రాసు గవర్నమెంటు హాస్పిటల్లో పరీక్ష చేయించింది. వారు పరీక్షించి ఎముకల స్పెషలిస్టు గుంటూరు బదిలీ అయినందున నన్ను గుంటూరు హాస్పిటల్‌కి వెళ్ళమన్నారు. అప్పటికి దాదాపు రెండున్నర సంవత్సరములు నుండి కుడికాలు నేలమీద మోపి నడువలేదు. ఇక కాలు బాగవుతుందనే నమ్మకం పోయింది. నా కుడికాలు గిలకలో తప్ప శరీరంలో ఎక్కడా ఏ జబ్బు లేదు. కనుక కుడికాలు గిలక క్రింది పాదము తొలగిస్తే ఏదైనా ఆర్టిఫిషియల్ పాదముతో నడవ వచ్చుకదా అనుకుని మా తండ్రితో కాని, మరెవరితో కాని చెప్పకుండా మద్రాసులోని ఒక ప్రైవేటు ఎముకల స్పెషలిస్టు వద్దకు వెళ్లి ఫీజు చెల్లించి, విషయం వివరించి చెప్పి గిలక నుండి పాదము తొలగిస్తే ఎంత ఖర్చవుతుందని అడిగాను. అందుకు ఆ డాక్టరు సమ్మతించలేదు. నేనే కాదు నువ్వు ఏ డాక్టరు దగ్గరకు వెళ్లినా ఎంత డబ్బు ఇచ్చినా ఆ పని ఎవరూ చెయ్యరు అన్నాడు. ఇక ఏమి చేసేది లేక నిరాశతో ఇంటికి వచ్చాను. ఈ సంగతి ఎవరికీ తెలియదు.

మద్రాసులో మా అక్క కమలమ్మ సినిమా యాక్టరు రాజసులోచన ఇంట్లో ట్యూషన్ చెప్తుంది. రాజసులోచనను చూడాలని వుంటే నాతో రా అంది. ఎంతో సంతోషంగా రిక్షాలో బయలుదేరాము. దారిలో 33 బెల్స్‌రోడ్డు, ట్రిప్లికేన్‌లో నివసించే సినిమా యాక్టర్ విజయనిర్మలతో కలసి ముగ్గురం రాజసులోచన ఇంటికి వెళ్తే, ఆమె తిరుపతి వెళ్లింది ఆదివారం వస్తుంది అని చెప్పారు. ఆదివారం ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూస్తూ వున్నాను. ఆదివారం ఉదయం రాజసులోచన ఇంటికి వెళ్ళటానికి సిద్ధపడుతుండగా అంతలో మా నాయన వచ్చి ప్రార్థనకి వెళ్దాం పద అన్నాడు. నాకు చాలా ఏడుపు వచ్చి ఏడుసుకున్నాను. తండ్రి అంటే భయంతో ఆయనతో చర్చీకి వెళ్ళాను. ఎక్కడో ఒక పొడవాటి తాటాకుల చాలా పెద్ద మందిరము అది. వందలమంది వచ్చారు ఆ చర్చీకి. ఆ ప్రార్ధన మధ్యాహ్నం 3 గంటల వరకు జరిగింది. మనసులో మా నాయనని తిట్టుకుంటూ, ఏడుస్తూ, వాక్యం వినకుండా కూర్చున్నాను. భోజనం చేసేటప్పుడు ఉప్పుడు బియ్యం అన్నం చూసి ఏడుపు ఇంకా ఎక్కువయ్యింది.

చందాపట్టేటప్పుడు అందరూ పాట పాడుకుంటూ లైనుగా వెళ్ళి పెట్టెలో కానుక వేసివస్తుంటే నేను కర్రమీద కుంటుకుంటూ వెళ్ళి చందావేసి వచ్చాను. వాళ్ళు పాడే తమిళపాటలు అస్సలు అర్థంకాలేదు. బయలుదేరేముందు మా నాయన ఫుల్‌పిట్ మీద వున్న తెల్లని లుంగీలు, లాల్చీలు ధరించి అయిదారుగురు పాస్టర్ల దగ్గరకు నన్ను తీసుకెళ్లి నా సంగతి చెప్పి ప్రార్థించమని చెప్పారు. వారు ప్రార్థనా విన్నపము వ్రాసి నా పేరు వ్రాసి ఇవ్వమన్నారు.

మద్రాసు హాస్పిటల్ వారు కాలుకు తగిలించిన ఇనుపచక్రం (స్ప్లింటర్)లో గుంటూరు వచ్చి జనరల్ హాస్పిటల్లో చేరాను. పది రోజులు మందులు వాడారు. ఇంక మందులు లేవు గమ్మున పండుకో అన్నారు. కాలు వ్రేలాడ దీయకూడదు, నడవకూడదు మంచం మీదనే అన్నీ. నా మనసులో ఎప్పుడు మద్రాస్ పోతానా ఎప్పుడు సినిమాయాక్టర్లను చూస్తానా అన్న ఆలోచన తప్పితే ఒక్కసారి కూడ యేసుప్రభువును తలుచుకోలేదు, ప్రార్థన

(...మిగతా 30వ పేజీలో)

మార్గదర్శి

# బ్రదర్ భక్తసింగ్

ఒకసారి మిర్యాలగూడ సువార్త దండ్రయాత్రలకు వెళ్ళారు. వీధుల్లో సువార్తను ప్రకటిస్తున్నారు. దాదాపు 40 మందికి పైగా సువార్తను చేస్తున్నారు. అప్పుడు హిందూమతాన్ని జీర్ణించుకొన్న కొందరు ఆర్యసమాజకులు సహోదరులను కొట్టడానికి కర్రలు, గడ్డపారలు తీసికొని వచ్చారు. రాళ్ళు విసిరారు. బ్రదర్ భక్తసింగ్‌ని కూడ కొట్టాలని తలంచారు. మత ప్రచారం చేయకూడదని మందలించారు. బైబిలుని చేతిలో ఉండేవాళ్లందరినీ కొట్టాలని నిర్ణయించుకున్నారు. అప్పుడు ఒక సహోదరుడు “అయ్యా! మేము మిమ్మల్ని క్రైస్తవ మతంలోకి దింపడానికి రాలేదు, మీరు దయచేసి ఈ రాత్రి జరిగే కూటానికి రండి, బ్రదర్ భక్తసింగ్ చెప్పే వాక్యాన్ని వినండి. తరువాత మీ ఇష్టం” అని చెప్పాడు. అదే విధంగా వాళ్ళు చాలామంది కూటానికి వచ్చారు. ఆ రోజు సహోదరుడు రక్షణ మార్గాన్ని గురించి, పరలోకరాజ్యాన్ని గురించి, “చేయి సహాయము లేనిరాయి” అనే అంశంపై ధారాళంగా ఉపదేశించాడు. అంతేకాక విదేశాల్లోని మత సంబంధమైన చరిత్రను విశదీకరించాడు. ఎక్కడా క్రైస్తవ మతాన్ని గురించి చెప్పవద్దని ఆ వచ్చిన హిందువులు మౌనంగా తిరిగి వెళ్ళారు. యేసుప్రభువు ఒక మార్గమని విని బ్రదర్‌ని ప్రశంసిస్తూ యేసుప్రభువు మతస్థాపకుడు కాదని ఆ వచ్చిన వాళ్లు తెలుసుకున్నారు.

కొన్ని సంవత్సరాల క్రితం ఒక పట్టణంలో బహిరంగ సువార్త జరిగిన తరువాత ఒక గ్రామంలో సువార్త కూటము జరిపించడానికి ఏర్పాటు చేశారు. అయితే బహిరంగ సువార్త ముగిసేసరికి చీకటి పడింది. అక్కడ నుండి పది మైళ్ళు ఆ గ్రామానికి నడచివెళ్ళాలి. ఆ గ్రామానికి దారి వీళ్ళెవ్వరికీ తెలియదు. ప్రభువు సహాయం కోసం ప్రార్థించారు. వీళ్ళకి లాంతరు కూడ లేదు. దారి సరిగ లేదు. అయితే తెలియని రీతిగ ప్రభువు సహాయం చేశాడు. బ్రదర్ భక్తసింగ్ ప్రభువు అప్పగించిన పనిని ఎన్ని శ్రమలొచ్చినా పట్టువదలక పరిచర్య చేశాడు. ఈ విధంగా రాత్రుళ్ళు కొన్ని మైళ్ళు దూరం నడచి సువార్త పరిచర్య చేసిన రోజులు బ్రదర్ జీవితములో ఎన్నో!

1933వ సంవత్సరం కరాచిలో పరిచర్య చేయడానికి తనకు తోడు మంచి విద్యావంతుణ్ణి ఇవ్వమని బ్రదర్ ప్రభువుని అడిగితే ఒక రోడ్లు ఊడ్చేవాడిని ప్రభువు జతపరచాడు. ఒకరోజు కూటానికి వెళ్ళారు. దాదాపు 500 మంది ఆ కూటానికి వచ్చారు. వాళ్ళలో చాలామంది తాగుబోతులు, జూదగాళ్ళయిన ఊడ్చేవాళ్ళు. వాళ్ళలో ఒకడు జ్వరంతో ఎక్కువగా బాధపడుతున్న ఒక యౌవనస్తుని తీసికొచ్చాడు. కొన్ని దినాలైన తరువాత బ్రదర్ ఆ ప్రాంతానికి వెళ్లి ఆ యౌవస్థుడు ఎలాగున్నాడని విచారింపగా అతడు చనిపోయి నట్లు తెలిసికొని, అతడి తండ్రిని కలిశాడు. అతని తండ్రి చాలా విచారంగా మంచంపై కూర్చున్నాడు. బ్రదర్ బైబిలులోని కొన్ని వచనాలు చెప్పి ప్రార్థించాడు.

అప్పుడు అతడు తన హృదయంలో భారం తగ్గిందని అతడు చెప్పాడు. ఆ యౌవనస్తుడు మరణించినందుకు సహోదరుడు చాలా బాధపడ్డాడు. అప్పుడప్పుడు సహోదరుడు ఆ వృద్ధుణ్ణి కలుస్తుండగా అతడు దేవుని నమ్మడంవల్ల ఆ ప్రాంతంలో అనేకమంది తిరిగి జన్మించారు. అక్కడ ఊడ్చే వాళ్ళు తెల్లవారి 4 గంటలకే పనికి పోవలసి ఉండటంవల్ల సహోదరుడు చీకటితోటే ప్రార్థన ఆరంభించేవాడు. నిద్రాహారాలు మాని సేవచేశాడు. ఆ ఊడ్చేవాళ్ళ బ్రదర్‌కి జతపని వాళ్ళు. ఒక అంధుడు పాటపాడేవాడు. వానికి ఒక కప్పు టీ మాత్రమే బ్రదర్ ఇచ్చేవాడు. వీళ్ళందరి సహకారంతోటే ఆ ప్రాంతంలో బ్రదర్ భక్తసింగ్ విపరీతంగా శ్రమించి అంకిత భావంతో సేవచేశాడు.

ఈ విధంగా తన జీవితయాత్రలో ఎన్నో అటుపోట్లు ఎదురైనా ప్రభువు సేవను నమ్మకంగా చేశాడు. అప్పగించిన పనిని తుదముట్టించాడు. విశ్వాసంతో ముందడుగు వేసి, దేవుని చిత్తప్రకారం అంకితభావంతో పరిచర్య చేశాడు. ప్రేమ కల ప్రభువు సహోదరుణ్ణి ఈ విధంగా వాడుకున్నందుకు వందనాలు.

**ధార్మిక దృక్పథం:**

దేవునిపై విశ్వాసముంచి దేవుని చిత్తాను సారంగా నడచి దైవకార్యాల్ని చేసే వాళ్ళని ధార్మికులు అంటారు. సహోదరుడు

పుస్తక సమీక్ష

# వెలుగులోకి....

ఆంధ్రరాష్ట్రంలో అందునా ఒంగోలును కేంద్రంగా చేసుకొని 39 సంవత్సరాలపాటు నిర్విరామంగా సువార్తను బోధించి, మాలమాదిగల్ని సంస్కరించి క్రీస్తుబాటలోనికి నడిపించిన ధన్యజీవి రెవ. జాన్.ఇ.క్లౌ. ఆయన మిషనరీ జీవితం ఇతర మిషనరీలకు, క్రైస్తవులకు మార్గదర్శకం. మంచితనం, ప్రేమ, పట్టుదల, ఓర్పు, సువార్త ప్రకటన పట్ల అధిక ఆసక్తి, కష్టాలను ఎదుర్కొనే సాహసం, క్షమా గుణం, క్లౌ దొర జీవితం మనకు నేర్పుతుంది.

ఆయన జీవితం – అనుభవాల్ని తెలుగు పాఠకులకు సుబోధకం చేస్తూ కిన్నెర రూబెన్‌గారు రచించిన పఠనీయ పుస్తకం "వెలుగులోకి". 276 పేజీల ఈ పుస్తకంలో క్లౌ దొర భారతావనికి వచ్చి ఒంగోలులో స్థిరపడి ఇక్కడ ప్రజల రక్షణార్థం పడిన శ్రమను ఆవేదనను రచయిత చక్కగా అక్షరబద్ధం చేశారు.

క్రీ.శ. 1836 జూలై 16 తేదీన ఎక్కడో అమెరికాలోని న్యూయార్క్ రాష్ట్రం, ఫ్రూస్‌బరిలో జన్మించి, అయోవా రాష్ట్రంలో పెరిగి మిషనరీ సేవకు సమర్పించుకొని 1865 మార్చి 26వ తేదీ మద్రాసు రేవు చేరడంతో మొదలైన క్లౌ జీవితం సుదీర్ఘసేవలో తరించి అస్వస్థుడై తన జన్మస్థలానికి దగ్గర వున్న రాచెస్టరు పట్టణంలో 1910 నవంబర్ 24న ప్రభు పాదసన్నిధికి చేరడంతో ముగుస్తుంది. 1909 వరకు ఒంగోలు కేంద్రంగా ఈ మహనీయుడు చేసిన ఆధ్యాత్మిక, నైతిక సేవ అంటరానివారుగా సంఘం వెలివేసిన ఎందరినో చీకటి నుండి వెలుగులోనికి నడిపించింది. 1876 సంవత్సరం దక్షిణ భారతదేశం గొప్ప కరువును చవిచూసింది. ధాత నామ సంవత్సరంలో వచ్చిన కరువు గనుక దీన్ని ధాత కరువు అన్నారు. వేలాదిమంది మనుష్యులను, పశువులను ఈ కరువు బలిగొంది. ఈ విపత్కర పరిస్థితిలో క్లౌ దొర అన్నార్తుల్ని బాధితుల్ని ఆదుకున్న తీరు ప్రశంసనీయం. అది క్రీస్తు ప్రేమకు తార్కాణం. తోటి వారే చేరదీయని పరిస్థితులలో పేద ప్రజలు అంటరానివారి వేదన వర్ణనాతీతంగా ఉండేది. క్లౌ దొరను దేవుడు ఆ సమయానికి ఒక మంచి సమరయునిలా భారతావనికి పంపాడు.

ఈయన సేవలో తూపిలి లక్ష్మయ్య, ఎర్రగుంట్ల పేరయ్య, పిడతల పేరయ్య, పెద్దేటి రామయ్యవంటి దేశీయులు రక్షించబడి గొప్ప సువార్త సేవా నాయకులుగా ఎదగటం ఒక విశేషం. దక్షిణ భారతావనిలో రెండవ పెంతెకోస్తు దినంగా జ్ఞాపకం ఉంచుకోదగ్గ రోజు 1878 జూలై 3వ తేది. ఆ రోజు 2222 (రెండువేల రెండు వందల ఇరవైరెండు) మంది గుంటూరు జిల్లా వెల్లంపల్లి గ్రామ సమీపాన ప్రవహిస్తున్న గుండ్లకమ్మ నదిలో బాప్తిస్మం తీసుకుని క్రీస్తును అంగీకరించిన రోజు. ఇది క్లౌ దొర సేవలో ఓ గొప్ప మైలురాయి.

ఇలాంటి అనేక ఆసక్తికరమైన ప్రోత్సాహకరమైన సేవా వివరాల్ని పాఠకులకు వెల్లడించే ఉత్తమ పుస్తకం **"వెలుగులోకి"**. ఆకర్షణీయమైన ముఖచిత్రంతో వెలువడ్డ ఈ పుస్తకం తెలుగు విశ్వాసులందరూ చదవదగ్గది. రచయిత శ్రమ అభినందనీయం.

పుస్తక ప్రాప్తిస్థానం : రచయిత, సుబోధాహోమ్,
1/3 విద్యానగర్
గుంటూరు

వెల : 100/- (వంద రూపాయలు)

సమీక్షకులు
**డా॥ కొండెపోగు బి.డేవిడ్ లివింగ్‌స్టన్**

## సువార్త సభ

**11 మార్చి 2008 మంగళవారం సాయంత్రం 6 గంటలకు, ఒంగోలు, హిల్‌కాలనీలో జరుగు సువార్త సభలో రెవ.డా॥ యం.యస్.శాంతవర్ధన్‌గారు ప్రసంగించెదరు.**

**అందరికీ ఇదే మా ఆహ్వానం**

# పరిశుద్ధ గ్రంథములో మన పరిచయము ఎంత?



## "బైబిలు జ్ఞాన పరీక్ష"

**అంశము : ఆదికాండము నుండి ప్రకటన గ్రంథము వరకు**

**తేది : 02-05-2008 శుక్రవారం**

**సమయం : ఉదయం 9-00 గంటల నుండి 5-00 గంటల వరకు**

**పరీక్ష సమయం : మధ్యాహ్నం 2-00 గంటల నుండి 5-00 గంటల వరకు**

**స్థలము : ప్రభువు సంఘము, కృపాదానంవీధి, క్లౌపేట, ఒంగోలు**

**రిజిస్ట్రేషను ఫీజు : రూ. 100/- లు**

**ఈ బైబిలు జ్ఞాన పరీక్షలో పాల్గొనదలచిన వారు**

**తేది 02-04-2008 లోపు మీ పేర్లు నమోదు చేయించుకొనవలెను.**

**ఇతర నియమ నిబంధనల కొరకు వచ్చే నెల పత్రిక చూడండి**

**వివరములకు సంప్రదించవలసిన ఫోన్ నంబర్లు :**

**9866716506, 9247859990, 9440217726, 9908822365**

బైబిలును మనం ప్రతిరోజు చదువుతాము. కొంత మంది తక్కువ సమయం కేటాయిస్తే కొంతమంది ఎక్కువ సమయం కేటాయిస్తారు. బైబిలును ఎంతసేపు చదివినా, చదివిన దానిని మనం గుర్తుంచుకోవటం కష్టం. ఒకసారి ఒక బోధకుడు, చాలా మందికి సుపరిచితుడు, ఆయనతో బైబిల్లోని ఒక సంఘటన గురించి మాట్లాడేటప్పుడు, ఆయన తప్పు మాట్లాడాడు. అప్పుడు బైబిలు తీసి ఆ సంఘటనలో ఏం వ్రాసి వుందో చూపించినప్పుడు ఆయన తన తప్పు తెలుసుకున్నాడు. ఇలా చాలామంది వారికి తెలిసిందే కరెక్టు అనుకుంటుంటారు. మరి మనకి ఏం తెలుసు? ఎంత వరకు తెలుసు అనే విషయం మనకి ఎలా తెలుస్తుంది? మనల్ని మనం ఎలా పరీక్షించుకో గలము? కాబట్టి మనకి తెలిసిన విషయాల్ని పరీక్షించుకునే అవకాశం వచ్చినప్పుడు దానిని మనం సద్వినియోగం చేసుకుంటే మంచిది.

బైబిల్లోని 66 పుస్తకాలలో మనం కొన్ని పుస్తకాలను అస్సలు చదవనే చదవం. అసలు బైబిల్లో 66 పుస్తకాలు వున్నాయని చాలామంది పాస్టర్లకే తెలియదు. ఒకవేళ తెలిసినా వాటి వరసక్రమం తెలియదు. సంఘకాపరులకు, సువార్తికులకు బైబిలు పరిజ్ఞానం లేకుండా బైబిలును బోధించటం ఎంత వరకు సమంజసం. అనేక గ్రామాల్లోని సంఘాలలో పనిచేస్తున్న సంఘకాపరులు కనీస బైబిలు పరిజ్ఞానం లేకుండానే బోధిస్తున్నారు.

కాబట్టి ఈ పరీక్ష నిర్వహించడం వల్ల అనేకమంది సంఘకాపరులు, సువార్తికులు బైబిల్లోని అనేక విషయాలు తెలుసుకొనుటకు అవకాశం ఏర్పడుతుందనే వుద్దేశ్యంతో 'హన్నాకృప' ఈ పనికి పూనుకుంది. ఈ పరీక్షకు హాజరయ్యే ప్రతి ఒక్కరికీ ఒక బహుమతి, రాను పోను చార్జీలు, మంచి భోజనవసతి కల్పిస్తే అనేక మంది హాజరు కావచ్చు. కాని మా వుద్దేశ్యం ఏంటంటే, దేవుని నడిపింపు వున్నవారు, దేవుని గ్రంథాన్ని పరిశోధించాలన్న ఆసక్తి వున్నవారు. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి, వారి స్వంత ఖర్చుతో పరీక్షకు హాజరవుతారని మా యొక్క విశ్వాసం. అయితే విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు ఇవ్వాలని మేము ఆశిస్తున్నాము. బహుమతులను తరువాత ప్రకటిస్తాము. ఈ యొక్క పరీక్ష విషయమైన సలహాలను, సంప్రదింపులను మాతో పంచుకోదలచిన వారు పై ఫోన్ నంబర్లకు ఫోన్ ద్వారాకాని లేదా హన్నాకృప ఆఫీసుకు వచ్చిగాని పంచుకోగలరు.

# కనువిప్పు



**యూనివర్సిటీ కాలేజిలో క్రొత్తగా చేరిన ఒక విద్యార్థితో ఒక క్రైస్తవ లెక్చరర్ గారి సుదీర్ఘ సంభాషణ**

అయితే, వారందరూ తమ అబద్దపు (దొంగ) సర్టిఫికేట్లను మార్పుచేయించుకొన్న తర్వాతనే, అలాంటి అబద్దపు (దొంగ) సర్టిఫికేట్లను ఎంతోకాలంగా కల్గియుంటున్నందుకు **"క్షమాపణ కోరుచూ ప్రార్థించిన తర్వాతనే" దేవుని యొక్క క్షమాపణ దొరుకుతుంది సుమా!**

**విద్యార్థి:** అంటే, సార్, అబద్దపు (దొంగ) సర్టిఫికేట్స్ ద్వారా మంచి చదువులు మంచి ఉద్యోగాలు, మంచి ఆస్తులు, మంచి ధనవృద్ధి పొందుకొన్న "సమయానుకూల" క్రైస్తవ సోదర సోదరీలు తాము అబద్దమాడి సంపాదించుకొన్న ఆస్తులు, ధనము మొదలైన వాటిని విడిచిపెట్టకుండానే కేవలం ఒక అనుకూల సమయం, ఒక అవకాశం వచ్చింది గదాయని వారి అబద్దపు (దొంగ) సర్టిఫికేట్స్‌ను మార్పు చేయించుకొని తామిప్పుడు "క్రైస్తవులం" అని బాహాటంగా చెప్పుకుంటూ కొనసాగితే సరిపోతుందా? అంటే, వారి అబద్ధపు (దొంగ) సర్టిఫికేట్స్ తెచ్చిపెట్టిన అక్రమ ఆస్తులను, ధనసమృద్ధిని వారు నిరాటంకంగా అనుభవించవచ్చా? అబద్దపు (దొంగ) సర్టిఫికేట్స్‌ను మార్పు చేయించుకున్నందు వల్ల ఆ పాపిష్టి ఆస్తులు, ఆ పాపిష్టి ధనము "పాపములేని సంపాదనగా లేక పాపమంటని ఆస్తులుగా" మారిపోతాయా?

**లెక్చరర్ :** ఓహ్! అదా నీ బాధ! నీ అనుమానం!! ఈ విషయంలో కూడ మనకు దేవుని పరిశుద్ధ వాక్యమే ఆధారం సుమా! లూకా 19:1-10 వరకు నీవు చదివితే మన 'సమయానుకూల క్రైస్తవ సోదరసోదరీలు' కూడా పొట్టి జక్కయ్య గారు 8వ వచనంలో చేసిన పనే చేయాలని నేను దృఢంగా నమ్ముచున్నాను. లేనియెడల దేవుడిచ్చిన రక్షణ వారికెట్లు నిలిచియుండును? లేదా వారెట్లు విశ్వాసులుగా కొనసాగుదురు? లేదా వారేలాగు అబ్రాహామునకు కుమారులు కుమార్తెలగుదురు???

**విద్యార్థి :** సార్! వెళ్ళేముందు మరో ధర్మ సందేహాన్ని గూర్చి నాకు నివృత్తి కల్గించాలని మిమ్మల్ని కోరుతున్నాను సార్.

**లెక్చరర్ :** ఏంటది ప్రభాకర్రావ్? అడుగు. నా చేతనైనంత మటుకు నీ సందేహానికి తప్పక సమాధానం చెప్తాను.

**విద్యార్థి :** సార్, ప్రభువు సేవకులు, ప్రభువు సువార్తికులు అంటే, దేవుని పరిశుద్ధ వాక్యోపదేకులు (పాస్టరుగారు, ఇవాంజలిస్టుగార్లు) సహితం గ్రామ పంచాయితీల చుట్టూ, మండలాఫీసుల చుట్టూ తిరిగి, తిరిగి తమ పిల్లలకోసం నేను కలిగియున్నలాంటి అబద్దపు (దొంగ) సర్టిఫికేట్లను సంపాదిస్తున్నారు. తద్వారా గ్రామ కరణంగార్ని, గ్రామంలో ఐదుగురు పెద్దలను, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గార్ని, యమ్మార్వోగార్ని 'పచ్చిదొంగలుగా (అబద్ధికులుగా)' చేస్తున్నారు కదా? మరి వారి సంగతేంటి సార్?

**లెక్చరర్ :** ఓహ్! అదా? చూడు ప్రభాకర్రావ్ దేవుని పరిశుద్ధ వాక్యం అందరి విషయంలోనూ ఒకే రీతిగా సెలవిస్తుంది. అయితే, ప్రభువు సేవకులు (దేవుని పరిశుద్ధ వాక్యోపదేశకులు) అందరికంటే మరెక్కువ నిజాయితీగా, మరెక్కువ జాగ్రత్తగా ఉండాలి. వారు సంఘస్తులందరికీ మంచి మాదిరిగా వుంటూ తద్వారా దేవుని పరిశుద్ధ నామానికి అందరి కంటే మరెక్కువగా మహిమ తేవాల్సివుంది. కానీ, ఈనాటి సంఘాల్లో ఇలాంటిదేమీ జరగటం లేదు. అందువల్ల, దేవుడు బహుగా దుఃఖిస్తున్నారని నేను చెప్పగలను. బహుశ ఈలాంటి దేవుని పరిశుద్ధ వాక్యోపదేశకుల పట్ల యాకోబు 3:1లో వ్రాయబడియున్న దేవుని వాక్యం ప్రకారం 'కఠిన తీర్పు' నెరవేరుతుందని నేను బలంగా నమ్ముతున్నాను. మరియు, వారు కూడా మరణకరమైన పాపం చేసిన, చేయించిన వారి జాబితాలో తప్పక చేరుతారు. కాబట్టి, వారు దానికి తగిన శిక్షను పొందక తప్పదు.

మరియు, యెహెజ్కేలు 3:20,21లో దేవుని యొక్క పరిశుద్ధ వాక్యము దేవుని వాక్యోపదేశకులకు ఈ విధంగా తెలియజేయుచున్నది "నీతిగలవాడు (అంటే, క్రైస్తవుడు) తన నీతిని విడిచి దుర్నీతిని అనుసరించినందున నేను

అతని ముందర అభ్యంతరము పెట్టగా అతడు మరణమగును. నీవు అతనిని హెచ్చరిక చేయని యెడల పూర్వము తాను చేసిన నీతి జ్ఞాపకము రాకుండా అతడు తన దోషమును బట్టి మరణమగును. అయితే, అతని ప్రాణవిషయములో నిన్ను ఉత్తరవాదిగా ఎంచుదును. అంయితే పాపము చేయవలదని నీతిగల వానిని (అంటే, క్రైస్తవుని) నీవు హెచ్చరిక చేయగా అతడు హెచ్చరింపబడి పాపము చేయక మానిన యెడల అతడు అవశ్యముగా బ్రదుకును, నీ మట్టుకు నీవు (ఆత్మను) తప్పించుకొందువు".

కాబట్టి, పైనుదహరించిన దేవుని వాక్యమును బట్టి చూడగా దేవుని పరిశుద్ధ వాక్యోపదేశకులు ఎట్టి పరిస్థితుల్లోనూ వారి పిల్లల కోసం లేదా వారి కోసం 'అబద్ధపు (దొంగ) సర్టిఫికేట్ పొందుట' అనే పాపమును చేయనే కూడదని సంఘస్తులకు చెప్పవలసియున్నదనియు గ్రహించవలసి యున్నది కదా!

**విద్యార్థి :** హమ్మయ్య! 1) క్రైస్తవులుగా మత మార్పిడి చేసుకున్న సోదరసోదరీలకు అనుకూలంగా పార్లమెంటులో బిల్లు పాస్ అయినా, పాస్ కాకపోయినా, 2) తాము అన్యాయంగా కోల్పోయిన ప్రభుత్వ ఉచిత సౌకర్యాలు పునరుద్ధరించబడినా, పునరుద్ధరించబడక పోయినా, 3) దేవుడు తన పరిశుద్ధ వాక్యోపదేశకుల (తన సేవకుల) విషయంలోను, తన సువార్తికుల విషయంలోను కఠినంగా వ్యవహరించినా, వ్యవహరించకపోయినా, 4) ప్రస్తుత క్రైస్తవ జనాంగం సామెతలు 28:3లో వ్రాయబడిన దేవుని వాక్యం ప్రకారం వారి యొక్క, వారి పిల్లల యొక్క అబద్ధపు (దొంగ) సర్టిఫికేట్లను వెంటనే సత్యమైన సర్టిఫికేట్లుగా మార్పించుకోవాలనీ, 5) అంతేకాక, వారింత వరకు ఆ అబద్ధపు (దొంగ) సర్టిఫికేట్ల ద్వారా సంపాదించుకున్న ఆస్తులను, ధనాన్ని సాధ్యమైనంత మేరకు పొట్టి జక్కయ్యకువలె వదులుకోవాలని, 6) అలా చేస్తేనే వారు యింతకాలంగా చేస్తూ వస్తున్న లేదా చేయిస్తూ వస్తున్న 'మరణకరమైన పాపం' నుండి 1తిమోతి 1:13 ప్రకారం క్షమించబడతారనీ, 7) లేని యెడల వారి 'క్రైస్తవ ఆత్మీయ జీవిత పరిస్థితి' అనుమానాస్పదంగానే ముగుస్తుందనీ గ్రహించాను సార్. దేవునికి స్తోత్రం. ఇది నాకోసం మీరిచ్చిన దేవుని వాక్యాను సారమైన చక్కని మహత్తరమైన విశదీకరణ అని కూడా గట్టిగా నమ్ముచున్నాను సార్. చాలా వందనాలు.

అయితే, కేవలం ప్రభుత్వం యిచ్చే ఉచిత సౌకర్యాలపై అత్యాశతో వారి చదువు, ఉద్యోగాల విషయంలో గత 30 ఏళ్ల క్రిందటే మా తాతగార్ల యొక్క ప్రోత్సాహం వల్ల అబద్ధపు (దొంగ) సర్టిఫికేట్లు కలిగియున్న నా తల్లిదండ్రులు 'మరణకరమైన పాపము' చేసిందిగాక నా విషయంలో కూడ అలాంటి నికృష్టమైన పాపమే చేయించారు. కాబట్టి 8) మన మధ్య జరిగిన సంభాషణా సారాంశాన్న వారితో కూడా పంచుకొని ఎలాగైనా సరే నాతో పాటు వారి యొక్క అబద్ధపు (దొంగ) సర్టిఫికేట్లను కూడా రద్దుగావించే ప్రయత్నం చేస్తాను. అంతేకాక, 9) పొట్టి జక్కయ్యవలే తాము వదిలించు కోగల్గినంత మేరకు తమ అక్రమ సంపాదనను త్వరగా వదిలించుకొని నిశ్చింతగా, భక్తిగా, బ్రతకమని వారిని కోరతాను సార్.

మరియు 10) క్రైస్తవులెవ్వరూ యస్.సి. సర్టిఫికేట్స& కలిగియుండరాదనీ, వాటి ద్వారా కాలేజీల్లో సీట్లను, స్కాలర్ షిప్‌లను ఆశించరాదనీ, ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నం చేయరాదనీ, ఎలక్షన్‌లలో పాల్గొనరాదనీ, లోన్లు పొందరాదనీ, అలా చేస్తే ప్రభుత్వ దృష్టిలో గొప్ప నేరమనీ, శిక్షార్హమనీ, ప్రభువుకి దుఃఖకరమనీ, నాతోటి యస్.సి. క్రైస్తవ విద్యార్థులకు పనికట్టుకుని చెప్తాను సార్.

మేము మరణకరమైన భయంకర పాపములో నుండి ఎలా బయటపడగలమో చక్కగా, దేవుని పరిశుద్ధ వాక్యాను సారంగా విశదీకరించి ఒప్పించినందుకు మీకు నా నిండు వందనములు సార్. దేవుని స్తోత్రం! వెళ్ళొస్తాను సార్!!

(సమాప్తం)


**2008 మార్చి నుండి 'హన్నాకృప' పత్రిక పేజీలను 28 నుండి 32 పేజీలకు పెంచుతున్నామని తెలియజేయుటకు సంతోషించుచున్నాము.**

సాక్ష్యము

# రత్నకుమారి

నా పేరు రత్నకుమారి. నేను కరీంనగర్ జిల్లా, ఇబ్రహీపట్నం జడ్.పి. హైస్కూల్లో రికార్డ్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాను. దేవుని కృపనుబట్టి నా తీరిక సమయంలో దేవుని పని చేయుటకు దేవుడిచ్చిన అవకాశాన్ని బట్టి దేవునికి స్తోత్రములు. కాని దేవుని పని జరగటం ఇష్టంలేని సాతాను నాకు అనేకమైన చిక్కులు తీసుకొస్తూ దేవుని పనికి ఆటంకం కలిగించటానికి శతవిధాల ప్రయత్నాలు చేస్తున్నాడు. అయినప్పటికీ దేవునియందలి గొప్ప ధైర్యంతో, దేవుడిచ్చిన స్వస్థతవరంతో ముందుకు సాగిపోతూ యేసుప్రభువు సాక్షులుగా జీవిస్తున్నాను.

ఒకసారి ఒకామె స్వస్థత ప్రార్థన కోసం నా దగ్గరకు వచ్చింది. ఆమె చెయ్యి పడిపోయి వుంది. నేను ఆమె కొరకు ప్రార్థన చేసినప్పుడు ఆమె ఆ చేతితో పని చేసుకోవడం ప్రారంభించింది. యేసుప్రభువు ఆమెకు స్వస్థత అనుగ్రహించాడు. దేవునికి స్తోత్రము. ఆమె 17 సం॥ల కుమారుడు శేఖరుకు యేసుప్రభువు అంటే గిట్టదు. ఎప్పుడూ తల్లిని దూషిస్తూ వుండేవాడని ఆమె చెప్పింది. అయితే ఆమె మా దగ్గరకు శేఖరును ప్రార్థన కొరకు పంపించింది. మా ఇంట్లో ప్రతిరోజూ స్త్రీల కూడిక జరుగుతుంది. ఈ బాబు కూడా వచ్చేవాడు. ప్రభువుని అంగీకరించి క్రీస్తు కొరకు బండగా తయారయ్యాడు. అయితే వారి కులదైవం పండగ వచ్చింది. ఆ పండుగకు శేఖర్ హాజరుకాలేదు. వాళ్ళమ్మ మాత్రం పూజలు చేసింది. చుట్టాలు శేఖర్‌ని నిందించారు. కాని శేఖర్ లొంగలేదు. క్రీస్తే నా దేవుడు అని జవాబిచ్చాడు. మరుసటి రోజు దీనంతటికీ కారణం ఆ రత్నకుమారి మేడం. ఆమెను ఈ ఊరులో ఉండనీయకూడదు, ఉంటే మా ఊరోళ్ళందరూ మతం మార్చుకుంటారు అని మా ఇంటి మీదకు వచ్చి మమ్ములను ఎన్నో విధాలుగా దూషించారు. మమ్మల్ని చంపుతామని బెదిరించారు. నా ఉద్యోగం తీసేయాలంటూ పై అధికారులకి అర్జీలు పెట్టారు. నా మీద ఎన్నో నిందలు వేసి మాట్లాడారు. పోలీస్ రిపోర్టు ఇవ్వాలని అనుకున్నాను కాని ప్రభువు దర్శనం ప్రకారం వెళ్ళలేదు. ఆయన ఇచ్చిన వాగ్దానం మీద ఆనుకున్నాము.



మత మార్పిడులు చేస్తోందని...

## మహిళపై ఠాణాలో ఫిర్యాదు

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 18 (ఆన్‌లైన్): పాఠశాలలోకి వచ్చే విద్యార్థులను బలవంతంగా మతమార్పిడులు చేస్తోందని రత్నకుమారి అనే మహిళపై ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో మండల కేంద్రానికి చెందిన గజ్జ రాజన్న అనే వ్యక్తి ఫిర్యాదు చేశాడు. మండల కేంద్రంలోని జడ్‌పీ ఎస్ పాఠశాలలో రికార్డు అసిస్టెంటుగా ఉద్యోగం చేస్తున్న రత్న కుమారి అనే మహిళ పాఠశాలలోకి వచ్చే కొందరు విద్యా ర్థులను బలవంతపు మతమార్పిడిలు చేస్తుందని గతంలోనే ఆరోపణలు వినిపించాయి. మండల కేంద్రానికి చెందిన గజ్జ రాజశేఖర్ అనే విద్యార్థిని 10వ తరగతి చదువుతుండ గా అతనికి బైబిల్‌తో పాటు ఇతర గ్రంథాలు ఇచ్చి క్రైస్తవ సీగా మత మార్పిడి చేసింది. అయితే దీనికి ప్రధాన కారణం పాఠశాలలో పనిచేసే రత్నకుమారి అని గుర్తించిన అతని తల్లిదండ్రులు, కొందరు గ్రామస్థులు ఆమె ఇంటికి వెళ్లి గొడవ చేశారు. తర్వాత ఆమెపై స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మతప్రచారం చేస్తున్నానని నా గురించి వార్తాపత్రికలలో వ్రాశారు.

గ్రామ ప్రజలను కాపాడాల్సిన గ్రామ రెండవ పౌరుడు ఉపసర్పంచి మా ఇంటికి వచ్చి ఇల్లు ఖాళీచేయాలని, లేకుంటే ఇల్లు తగులబెడ్తామని ఇంటి ఓనర్స్‌ని బెదిరించారు. చాలా అసహ్యమైన మాటలు మాట్లాడారు. నాకు ఏం చెయ్యాలో అర్థంకాక మౌనంగా ప్రభువువైపు చూస్తున్నాను. మరుసటిరోజు దేవుని సన్నిధిలో కన్నీటి ప్రార్థన చేస్తూ 'సేవ మానేస్తాను, సేవ చెయ్యలేను' అని ప్రార్థిస్తున్నాను. నిలువెత్తు శిలువలో ఆయన రక్తము, నీరు అంతా కారిపోయి ఎండి పోయిన మాంసంలా కనిపించి నావైపు చూస్తున్నాడు. ఆ చూపులు నా గుండెను పగులగొట్టేలా వున్నాయి. నేను సేవకు వెళ్ళను అన్నప్పుడెల్లా ఆ చూపు నన్ను వెంటాడుతూనే వుంది. ఆ చూపే పదే పదే జ్ఞాపకం వస్తుంది. 'ప్రభువా నీ కొరకు చనిపోవడానికి సిద్ధంగా వున్నాను' అన్నాను నేను. యెషయా గ్రంథం 40వ అధ్యాయమంతా నాతో మాట్లాడాడు. భయపడక ధైర్యంగా సువార్త ప్రకటించు నీ జీతం నా దగ్గర వుంది అని పలికిన మాటలు నన్ను ధైర్యపరచాయి. ఒక్కొక్క వచనం నా కొరకే అన్నట్లు అని పించింది. నాకు చాలా ధైర్యం వచ్చింది. ఖచ్చితంగా నాలుగు గంటలు గడవక ముందే ఆ ఉపసర్పంచ్‌కి యాక్సిడెంట్ జరిగి, 5 లక్షల నష్టం వచ్చింది. ఇది జరుగుట ద్వారా నాకు సంతోషం కలిగిందనుకోవచ్చు. కాని, ఆ వీధిలోని వాళ్లు యేసుప్రభువుని మతపరంగా కాకుండా ఆయనని నమ్మిన వాళ్ళ పక్షంగా వున్న గొప్ప దేవుడు అని భయపడ్డారు.

ఇప్పటికీ స్త్రీలు, పిల్లలు ప్రార్థనకి వస్తారు. ఎంత గొడవ జరిగినా, ప్రభువు అందరినీ నడిపిస్తున్నాడు. మేము చేస్తున్నది సువార్త సేవ. మాకు ఒక సంఘము కాని, ఇల్లు కాని తగినంత ఆర్థికస్తోమత కానిలేవు. ఎవ్వర్ని కూడ అడగము. నన్ను నడిపిస్తున్న ప్రభువు గొప్పవాడు. నాకు అన్యాయం చేయడు. నా వెనుక నాకు కావలి కాయువాడు ఆయనే. ఆయనకు స్తోత్రములు.

బాలల శీర్షిక

# బైబిలు జ్ఞానము

ఈ మధ్య నేను ఒక గ్రామములోని ఒక సంఘములో సండేస్కూలు క్లాసు తీసుకున్నాను. అక్కడ గత ఆరు సంవత్సరాల నుండి సండేస్కూలు జరుగుతుందని చెప్పారు. అప్పుడు నేను పిల్లలను సృష్టిక్రమము గురించి కొన్ని ప్రశ్నలు అడిగాను. దేవుడు మొదటి రోజు ఏమి చేశాడు అన్న ప్రశ్నకు ఒక్కరూ సమాధానం చెప్పలేదు. ఆరు సంవత్సరాల నుండి జరుగుతున్న సండేస్కూల్లో ఆదికాండం మొదటి అధ్యాయంలోని సృష్టిక్రమం బోధించనందుకు నేను చాలా ఆశ్చర్యపోయాను. అదే ప్రశ్న సండేస్కూలు టీచర్‌ని అడినప్పుడు 'దేవుడు మొదటిరోజు ఆదాము, హవ్వలను చేశాడు' అని చెప్పారు. కాబట్టి బోధించే వాళ్ళకే బైబిలు జ్ఞానం లేనప్పుడు ఇంక పిల్లలకు ఎక్కడ నుండి వస్తుంది. ఆ గ్రామంలోనే కాదు, ఏ గ్రామంలో చూసినా సండేస్కూలు జరిగే ఏ సంఘములో చూసినా పిల్లలకు బైబిలు జ్ఞానం చాలా తక్కువగా వుండటం గమనించాను. కొన్నిచోట్ల అస్సలు బైబిలు జ్ఞానమే లేదు. సంఘములో సండేస్కూలు నిర్వహించే గ్రామాలు చాలా తక్కువ. ఎక్కడైనా సండేస్కూలు జరుగుతుంది అనుకుంటే అక్కడ అసలు బైబిలే బోధించరు. ఏదో రెండు యాక్షన్‌సాంగ్స్, కంఠతవాక్యం, బైబిలుకు సంబంధించని ఒక నీతి కథ చెప్పి పంపిస్తుంటారు.

వాళ్ళ వాళ్ళ సంఘాల్లో సండేస్కూలు నిర్వహించడం తమ బాధ్యత కాదు అని అనుకుంటుంటారు సంఘకాపరులు. మరి చిన్నబిడ్డలకు బైబిలు బోధించాల్సిన బాధ్యత ఎవరిది? ఒక సంఘంలో వున్న సభ్యుల యొక్క కుటుంబంలోని ప్రతి ఒక్కరి బాధ్యత ఆ సంఘకాపరి మీద లేదా? మరి అలాంటప్పుడు దేవుడు ఎక్కువగా ప్రేమించే చిన్నబిడ్డలను నిర్లక్ష్యం చేస్తే దేవుడు చూస్తూ వూరుకుంటాడా? పరలోకరాజ్యం ఈలాటి వారిదే అని స్వయంగా యేసుప్రభువే చిన్నబిడ్డల గురించి చెప్పినప్పుడు, మరి చిన్నబిడ్డలకు బైబిలు గురించి బోధించాల్సిన బాధ్యత సంఘకాపరికి లేదా? చిన్నబిడ్డల యొక్క ఆధ్యాత్మిక జీవితానికి ఎవరు బాధ్యత వహిస్తారు? అసలు సంఘములోని ప్రతి ఒక్కరి ఆధ్యాత్మిక జీవితానికి సంబంధించిన బాధ్యత సంఘకాపరికి లేదా? వారంలో ఒక గంటసేపు చిన్నబిడ్డల కోసం సమయం కేటాయించలేనంత ఎక్కువ బిజీగా ఉంటున్నారా సంఘకాపరులు? ఊపిరి సలపనంత బిజీగా వున్నా కూడా బిడ్డలను నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసం.

**'నాయందు విశ్వాసముంచు ఈ చిన్నవారిలో ఒకనిని అభ్యంతరపరచు వాడెవడో, వాడు మెడకు పెద్ద తిరుగటి రాయి కట్టబడినవాడై మిక్కిలి లోతైన సముద్రములో ముంచి వేయబడుట వానికి మేలు'** (మత్తయి 18:6). ఈ వాక్యాన్ని మనం క్షుణ్ణంగా పరిశీలిస్తే చిన్నవారిని అభ్యంతరపరచే వారి పట్ల యేసుప్రభువు తన యొక్క అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నట్లు గమనించగలం. బిడ్డలను నిర్లక్ష్యంచేసే వారి పట్ల ఆయన ఎంత కోపంగా వున్నాడో మనం గమనించాలి. తిరుగటిరాయి కట్టి మిక్కిలి లోతైన సముద్రంలో వేస్తే యింక బయటకు రాకుండా వుండాలన్నంత కోపంగా వున్నాడు యేసుప్రభువు. మరి చిన్నవారిని దేవుని దగ్గరకు రానీయకుండా అభ్యంతరపరుస్తున్నది ఎవరెవరో మనం చూద్దాం. చిన్నబిడ్డలను దేవుని దగ్గరకు పంపించే విషయంలో ముందుగా తల్లిదండ్రులదే బాధ్యత అని చెప్పవచ్చు. ఎందుకంటే బిడ్డలను స్కూలుకు పంపించే విషయంలో చూపించే శ్రద్ధ సండేస్కూలుకు పంపించే విషయంలో చూపించరు. ఈ లోకజ్ఞానం కొరకు చూపించే ఆసక్తి బైబిలు జ్ఞానం పెంపొందించే విషయంలో చూపించరు. బిడ్డలు స్కూలుకు వెళ్ళకపోతే వారిని దండించి స్కూలు పంపిస్తారు. అదే సండేస్కూలుకు పంపించాలన్న ఆలోచన కూడ వారికి రాదు. బిడ్డలకు దేవుని గురించి చెప్పకపోవడం కూడ వారిని దేవుని యొద్దకు రానీయకుండా అభ్యంతరపర చటంతో సమానం. వారికి దేవుని గురించి, బైబిలు గురించి బోధించటమే వారిని దేవుని యొద్దకు నడిపించటం. ఆదివారం తప్పని సరిగా సండేస్కూలుకు వెళ్ళాలి అనే భావన పిల్లల్లో కలిగించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదే. ఒకవేళ తల్లిదండ్రులకు బైబిలు బోధించేటంత జ్ఞానము, తీరిక లేనట్లైతే వారిని సండేస్కూలుకు పంపడం ద్వారా వారిని దేవుని యొద్దకు నడిపించిన వారవుతారు. నీవు నీ యింట కూర్చుండునప్పుడు త్రోవను నడుచునప్పుడు పండుకొనునప్పుడు వాటిని (దేవుని మాటలను) గూర్చి మాటలాడుచు **వాటిని మీ పిల్లలకు నేర్పి...'** ద్వితీయో. 11:19,20.

(సశేషం)

# శూన్యం నుండి పదార్థం - అదే సృష్టి విన్యాసం

విశ్వాసమనునది నిరీక్షింపబడువాటి యొక్క నిజ స్వరూపమును, అదృశ్యమైనవి యున్నవనుటకు రుజువునై యున్నది. దానినిబట్టియే పెద్దలు సాక్ష్యము పొందిరి. ప్రపంచములు దేవుని వాక్యమువలన నిర్మాణమైనవనియు, అందునుబట్టి దృశ్యమైనది కనబడెడు పదార్థములచే నిర్మింపబడలేదనియు విశ్వాసముచేత గ్రహించుకొను చున్నాము. పరి.పౌలు. క్రీ.శ.70. (హెబ్రీ.11:

ఈనాడు, జనవరి 20, 1984 :

న్యూఢిల్లీ, జనవరి 19 : పరిపూర్ణమైన శూన్యం నుండే భౌతిక పదార్థాలు, దివ్యభూతమైన వస్తువులు ఉత్పత్తి అవుతున్నాయని భారతదేశ అణుశక్తిశాఖకు చెందిన శాస్త్రజ్ఞుడు శ్రీ పరమహంస తివారి చేసిన విప్లవాత్మకమైన సిద్ధాంతం ప్రపంచవ్యాప్తంగా శాస్త్రజ్ఞుల దృష్టిని ఆకర్షిస్తున్నది. ఈ సిద్ధాంతం మీద శ్రీ పరమహంస సుమారు పదేళ్లుగా కృషి చేస్తున్నారు. శూన్యంగా మనం భావిస్తున్న విశ్వాంతరాళం ద్రవ్యరహితమైన, కుదించడానికి అసాధ్యమైన, అత్యంత క్రియా శీలమైన ద్రవంతో పోల్చదగిన 'శక్తి'తో నిండి వున్నదని పరమ హంస చెప్పారు. స్థూల దృష్టికి శూన్యంగా తోచే ఈ శక్తి ప్రవాహం నుంచే కొన్ని పరిస్థితులలో ద్రవ్యం ఉత్పత్తి అవుతున్న దని శ్రీ తివారి చెప్పారు. శ్రీ తివారి రాసిన రెండు పుస్తకాలు (స్పేస్ వోర్టెక్స్ థీరీ, ఆరిజిన్ ఆఫ్ ఎలక్ట్రాన్స్ ఫ్రం ఎంప్టీ స్పేస్) అమెరికాలోను, యూరప్‌లోను శాస్త్రజ్ఞులను అమితంగా ఆకర్షిస్తున్నాయి. పరమహంస సిద్ధాంతాలు ప్రవచనాల మాదిరిగా గాక, పోజిటివ్, నెగటివ్ ఎలక్ట్రాన్‌ల సహాయంతో నిర్మించడానికి అమెరికన్ భౌతిక విజ్ఞానులు, ప్రిన్స్‌టన్‌కు చెందిన డా॥ ఎల్లార్, పిట్స్‌బర్గ్‌కు చెందిన డా॥ స్టెర్న్‌గ్లాస్ చేసిన కృషి తన సిద్ధాంతానికి పరోక్షంగా మద్దతు నిచ్చాయని శ్రీ పరమహంస తివారి చెప్పారు. ప్రస్తుతం భౌతిక శాస్త్రాన్ని అయో మయంగా చేసిన కొన్న సందిగ్ధ పరిస్థితులను, తివారి కొత్త సిద్ధాంతం తొలగించి, శాస్త్రాన్ని ఎంతో సరళం చేస్తున్నది. ప్రాథమిక కణాలు ఎక్కడ నుండి వచ్చాయో, అవి ఏవిధంగా ద్రవ్యాన్ని, విద్యుదావేశాన్ని సంపాదించాయో వివరించకుండా, ఏవి యెందుకు జరుగుతున్నాయనే విషయాన్ని మాత్రమే ఆధునికశాస్త్రజ్ఞానం బోధిస్తున్నదని తివారి వ్యాఖ్యానించారు. ఆధునిక భౌతికశాస్త్ర సమీకరణాలలో స్థిరరాశులు, చరరాశులు అసంఖ్యాకంగా వస్తాయి. కాని తివారి చెప్పిన వోర్టెక్స్ సిద్ధాంతం మాత్రం కాంతివేగం, ఎలక్ట్రాన్ వ్యాసార్థం అనే రెండు స్థిరరాశుల మీదనే నిర్మితమైంది. ద్రవ్యము, ఆవేశము, యితర గణిత రూపకంగా వుండడంవల్లనే అవి శాస్త్రజ్ఞుల దృష్టిని ఆకర్షిస్తున్నాయని చెప్పవచ్చు. శక్తి ప్రవాహం కాంతి వేగాన్ని చేరి, సుడులు తిరిగేటప్పుడు కొంతమేర శక్తి ప్రవాహం లోపించిన ఖాళీలు ఏర్పడతాయని అవే నిజమైన శూన్య ప్రదేశా లని అటువంటి వాటిలో మిల్లీమీటరులో మూడు లక్షలకోట్లలో ఒక భాగం వ్యాసార్థం కలిగినవే ఎలక్ట్రానులవు తున్నాయని తివారి చెబుతున్నారు. ప్రకృతి సృష్టించగలిగిన ఒకేఒక్క రకపు కణాలు ఎలక్ట్రాన్‌లని ఆయన గుర్తుచేశారు. ఎలక్ట్రాన్‌లకు విద్యుతావేశం రీత్యా వ్యతిరేకమైన పోజిట్రాన్‌లు, ఎలక్ట్రాన్‌ల విభిన్న రకాల సంయోగాల ఫలితంగా స్థిరత్వం కలిగిన ద్రవ్యం ఉత్పన్నమవుతున్నదని పరమహంస చెప్పారు. ద్రవ్యరహితమైన అంతరిక్ష శక్తి నుంచి ద్రవ్యాత్మకమైన కణాలు ఏర్పడుతున్నా యన్న ప్రతిపాదన యిప్పటి పరిస్థితులలో పదార్థ విజ్ఞాన భావనలో విశిష్టమైనదని పరమహంస వివరించారు.

ప్రోటాన్ క్షీణతను కనుగొనడం, ప్రతి పదార్థాన్నీ చరరాసులపై రెండు స్థిరరాసుల నుంచే ఉత్పన్నమవుతాయి. తివారి దర్శించిన విశ్వంలో అంతరిక్షశక్తి ప్రవాహం నుంచి జనించే ఒకే ఒక అంశం నుంచి ఉద్భవించేవేనని తివారి చెప్పారు. పదార్థాన్ని నిర్మించేది ఎలక్ట్రాన్‌లేనని తను చెప్పే సిద్ధాంతం ప్రస్తుత శాస్త్రజ్ఞులు విశ్వసిస్తున్న సిద్ధాంతానికి పూర్తి విరుద్ధంగా వున్నప్పటికీ, ఐన్‌స్టీన్ సిద్ధాంతాలతో సహా అన్నీ సిద్ధాంతాల మౌలిక సమీకరణాలకు తన వోర్టెక్స్ సిద్ధాంతం చక్కగా అద్దం పడుతుందని తివారీ చెప్పారు. భూగోళం ద్రవ్య రాశికి, దాని పరిభ్రమణ వేగము పెరుగుతాయని తను చెప్పిన జోస్యాలు, యిప్పటికే ప్రయోగ పూర్వకంగా నిర్ధారణ అయ్యా యని తివారి చెప్పారు. గురు గ్రహానికి, కుజ గ్రహానికి మధ్య శూన్యం నుండి ఒక క్రొత్త గ్రహం జన్మిస్తుందని తను చెప్పిన జోస్యం యింకా నిర్ధారణ కావలసియున్నదని తివారి చెప్పారు.

శూన్యమండలముపైని ఉత్తర దిక్కుననున్న ఆకాశ విశాలమును ఆయన పరచెను. శూన్యముపైని భూమిని వ్రేలాడచేసెను. వాటి క్రింద మేఘములు చినిగిపోకుండ ఆయన తన మేఘములలో నీళ్ళను బంధించెను. యోబు క్రీ.పూ. 1719

# సువార్తలలోని యేసు కథ



దేవుడు-వెలుగు కమ్మని పలుకగా వెలుగు కలిగెను. తర్వాతనే ఆయన ఏదైనా కలుగచేశాడు. ఆ వెలుగు సూర్యుని వలన కలిగే వెలుగు కాదు. అది దేవునిలో నుండి వెడలే వెలుగు. అందుకే యేసుప్రభువు 'నేను ప్రపంచానికే వెలుగును నన్ను అనుసరించిన వాళ్ళు అంధకారములో నడువరు. వాళ్ళకు జీవితం యొక్క వెలుగు లభిస్తుంది' అని అన్నాడు. పర్ణశాలల పండుగ ప్రారంభదినము సాయంకాలం దేవాలయ ప్రాంగణంలో తూర్పు ప్రక్కన వున్న స్త్రీల ఆవరణము వద్ద పండుగ కొరకు ఏర్పాటు చేయబడిన యాభై అడుగుల ఎత్తైన దీపస్థంభము ప్రక్కన ఆయన నిలబడి బోధిస్తూ ఈ మాటలు చెప్పాడు. ఈ దీపస్థంభముపై శిఖరమున నాలుగు పెద్ద ప్రమిదలు వ్రేలాడబడి వుంటాయి. కాలంచెల్లిన యాజకుల వస్త్రములతో లావాటి ఒత్తులను తయారుచేసి ఆ ప్రమిదెలతో ఉంచుతారు. సాయంకాలం యవ్వనస్తులైన లేవీయులు ఇందుకై తయారు చేయబడిన నిచ్చెన సహాయంతో పైకి ఎక్కి తమ భుజములకు తగిలించుకొనిన తిత్తులలోని ఒలీవల నూనె ప్రమిదలలో క్రుమ్మరించి క్రిందికి వస్తారు. తరువాత తమ చేతులలో వెలిగించబడిన కాగడాలతో కొందరు యువకులు పైకి వెళ్లి వత్తులను వెలిగించి వస్తారు. ఆ వత్తులు పూర్తిగా అంటుకొనే టప్పటికి ఆకాశంలో వెలసిన వెలుగు వెన్నెలవలె ప్రకాశిస్తుంది. అప్పుడు పండుగకు వచ్చిన లక్షలమంది ముఖాలు ప్రకాశిస్తాయి. అప్పుడు పండుగ నాట్యము ప్రారంభమవుతుంది. రకరకాల వాయిద్యాలు వాయించే వారు వారికి తోడుగా నాట్యమాడే వారు కలసి సంభ్రమం చేస్తారు.

బాప్తిస్మము ఇచ్చే యోహాను యేసుప్రభువును యేసుని నిజమైన వెలుగు అన్నాడు. యెషయ ప్రవక్త - మెస్సయ నిత్యమైన వెలుగు అన్నాడు. యేసు యూదులకేగాక మానవాళి మొత్తానికి వెలుగునని చెప్పాడు. మానవాళి అంతా చీకటిలోను మరణఛాయలోని నివశిస్తున్నారు. వెలుగులో ఉన్నప్పుడు భయము వుండదు. అలాగే యేసును వెంబడించుట ద్వారా వెలుగు కలిగి జీవిస్తారు.

యూదులు యాభై అడుగుల దీపస్థంభము స్థూపమువలె కట్టి ఇశ్రాయేలీయులు అరణ్యములో అగ్ని స్థంభముచే రాత్రి వెలుగు పొందారు అని చెప్పారు. అది రాత్రి వెలుగిచ్చే అగ్ని స్థంభం అయితే మెస్సయ్య రాత్రింబగళ్ళు మనతో మనలో ఉండి వెలుగు ఇస్తాడు. నీ పక్షాన నువ్వే సాక్ష్యము చెప్పుకొంటు న్నావు నీ సాక్ష్యము చెల్లదు అన్నారు.

యేసు సమాధానం చెప్తూ నేను నా పక్షాన సాక్ష్యం చెప్తే నమ్మవచ్చు. ఎందుకంటే నేనెక్కడ నుండి వచ్చానో ఎక్కడికి వెళ్తున్నానో నాకు తెలుసు కాని నేనెక్కడి నుండి వచ్చానో. ఎక్కడికి వెళ్తున్నానో మీకు తెలియదు. మీరు అందరి మానవుల వలె తీర్పు తీర్చబడతారు. నేను ఎవరిపైనా తీర్పు చెప్పను కాని నేనొకవేళ తీర్పు చెపితే నా తీర్పు సత్యసమ్మతమైనది. ఎందుకంటే నేనొంటరిగా తీర్పు చెప్పటం లేదు. నన్ను పంపిన తండ్రి నాతో ఉన్నాడు. ఇద్దరు కలసి సాక్ష్యం చెప్తే ఆ సాక్ష్యాన్ని నమ్మవచ్చని మీ ధర్మశాస్త్రంలో వ్రాశారు. నేను నా పక్షాన సాక్ష్యం చెప్తున్నాను. నా ఇంకొక సాక్షి నన్ను పంపిన ఆ తండ్రి అని అన్నాడు. అప్పుడు వాళ్ళు నీ తండ్రి ఎక్కడ ఉన్నాడు? అన్నారు.

యేసుప్రభువు - మీకు నేను ఎవరినో, నా తండ్రి ఎవరో తెలియదు. నేనెవరో తెలిస్తే నా తండ్రి ఎవరో మీకు తెలుస్తుంది. అని అనినప్పుడు పరిసయ్యులకు విపరీతమైన కోపం వచ్చింది. ఆయనను బంధించాలని అనుకున్నారు. కాని ఆయన వారికి కనిపించలేదు. ఆయనను బంధించాలని ఎన్నిసార్లు అనుకు న్నారు. వాళ్లు అనుకున్న వారినందరిని బంధించారు. సన్హెద్రిన్ సభ యొద్దకు తీసికొని వెళ్ళారు. అయితే యేసును చూచి నప్పుడు వారు చెయ్యదలచుకొనిన పని ఆయన ఎదురుగా చెయ్యలేకపోతున్నారు. పరిసయ్యులలోనే చాలమంది యేసును విశ్వసించినట్లుగా కనిపించినా యేసును ఎందుకు బహిరం గంగా ఒప్పుకోలేక పోతున్నారో వారికే అర్థంకావటం లేదు.

మరియొకసారి యేసు వాళ్ళతో నేను వెళ్తున్నాను. మీరు నాకోసం వెదుకుతారు. కాని నేను వెళ్ళేచోటికి మీరు రాలేరు. ఎందుకంటే మీరు మీ పాపాల్లోనే మరణిస్తారు అన్నాడు. వెంటనే ఒక పరిసయ్యుడు 'మీరు ఆత్మహత్య చేసుకుంటారా?' అన్నాడు. అప్పుడు యేసు - మీరు ఇక్కడి వారు నేను పైనుండి వచ్చిన వాడిని. మీరు ఈ లోకపు వాళ్ళు నేను ఈ లోకపు వాడినికాను. మీరు మీ పాపాలతో మరణిస్తారు' అన్నాడు కొంచెం కటువుగా.

(సశేషం)

# ప్రయాణంలో మజిలి

ఆర్.టి.సి. కడప రీజినల్ మేనేజర్ సాల్మన్‌రాజుగారి సహవాసంలో రోమన్ కేథలిక్ వారి విషయంలో నాకున్న అపోహలన్నీ తొలగిపోయాయి. వారి లోతైన ఆత్మీయ జీవితం గురించి ఎన్నో ప్రశ్నలు వారిని అడిగి తెలుసు కున్నాను. మాటల సంధర్భములో నేను కేరళలోని చాలకుడి వద్ద మురంగనూరులోని డివైన్ సెంటర్ గురించి విన్నాను. అక్కడ వారం రోజులు నెలలో నాలుగుసార్లు రిట్రీటులు జరుగుతాయి. హాజరైన తర్వాత వచ్చే అనుభవాలు గొప్పవని విని అక్కడికి వెళ్ళాలని ప్రభువును ప్రార్థించాను. ఒకసారి సాల్మన్‌రాజు గారి భార్య నలందగారు 'మీరు మురంగనూరు వెళ్ళాలనుకుంటే అందుకయ్యే ఖర్చు నేను భరిస్తాను' అని చెప్పారు.

ఫిబ్రవరి 14వ తేది సాయంత్రం కోర్బా ఎక్స్‌ప్రెస్‌లో నేను నా భార్య మురంగనూరు బయలుదేరాము. మళయాలం నాకు అర్థంకాదు. అంతేకాక ఇంతకుముందెన్నడూ నేను కేరళ వెళ్లలేదు. రైలు దిగవలసిన బాలకుడి స్టేషన్ దిగి బస్టాండుకు వెళ్ళాను. బస్టాండ్‌లో ఒకే ఒక్క యౌవనస్తుడు జాషువా నిలబడి వున్నాడు. డివైన్ సెంటర్‌కి ఏ బస్ ఎక్కాలి అని అడిగాను. అప్పుడు అతను నేను కూడా అక్కడికే వెళ్తున్నాను అని చెప్తుండగానే బస్ వచ్చింది. అతనే మా సామాను బస్‌లో పెట్టి, మళ్ళీ కొంత దూరం వెళ్ళాక ఇంకో బస్ మారి, బస్ దిగాక కిలో మీటరు దూరంలో వున్న డివైన్ సెంటర్‌కు నడిచేటప్పుడు మా లగేజీలో వున్న అతి బరువైన సూట్‌కేస్‌ని అతనే మోసుకుంటూ మమ్మల్ని అక్కడికి తీసుకెళ్ళాక అతను వెళ్ళి పోయాడు.

నేను అక్కడ ఫాదర్‌తో మాట్లాడి మాకు ఒక రూము కావాలని అడిగినప్పుడు ఫాదర్ కొన్ని అభ్యంతరాలు చెప్పాడు. అంతలో ఒక తెలుగు సిస్టర్ ఆమె పేరు సావియో, అనుకోకుండా అటువైపు వచ్చింది. ఆమె నా సంగతంతా విని, ఫాదర్‌తో అరగంటసేపు మాట్లాడి వారిని ఒప్పించి మాకు ఒక రూము ఇప్పించింది.

ఉదయం 6 గంటల నుండి ప్రార్థనలు మొదలవుతాయి. బాహ్యారాధన ఏమీలేదు. ఒక్కోదశలో పెంతెకోస్తు వారి ఆరాధనవలె కనిపించింది. హల్లెలూయ, దేవునికి స్తోత్రము అనే మాట మాత్రమే వినిపించింది. యేసుప్రభువును తప్పితే మరెవరి పేరు వారు పలుకరించలేదు. మురంగనూరు నుండి శనివారం కాలాడి వెళ్ళి మలయటూరు వెళ్ళాము. పరి.తోమా నివశించినట్లు చెప్పబడిన కొండ ఎక్కాను. భయంకరమైన పెద్ద రాళ్ళ మధ్య అతి కష్టం మీద మూడున్నర గంటలు కొండ ఎక్కవలసి వుంది. కొండ మీద చర్చి కట్టబడింది.

తిరుగు ప్రయాణంలో ఎర్నాకులంలో బోటుజట్టీకి టికెట్లు తీసుకోవడానికి క్యూలో నిలుచుంటే నా ముందు దేవుడు మార్టిన్ సెబాస్టన్ అనే వ్యక్తిని నిలిపినందు వలన అతను ఒక పెద్ద హోటల్ మేనేజరైనా, మమ్ములను యూరోపియనులు మన దేశములో కట్టిన మొదటి చర్చి వాస్కోడిగామా జ్ఞాప కార్థంగా కట్టినది మాకు చూపించాడు.

ఎర్నాకులం వచ్చి త్రివేంద్రంకి స్లీపర్‌కోచ్ తీసుకున్నాం. స్లీపర్ కోచ్ నిండా జనం వున్నారు. నేను బండెక్కి నా ఎదురు సీటు మీద బ్యాగ్ పెట్టి కూర్చున్నాను. బండి కదిలింది. కొంచెంసేపటికి ప్రక్క కంపార్ట్‌మెంటులో నుండి 55సం॥ల లావుపాటి వ్యక్తి తన కుమార్తెను వెంటపెట్టుకొని సీటు మీద నా బ్యాగ్‌ను చూసి విసుగ్గా మళయాలంలో ఏదో అంటూ వెళ్లి అవతల అరలో కూర్చున్నాడు. నా ప్రక్కన కూర్చున్న ఒక మిలటరీ ఆయన నన్ను చూచి నవ్వుతూ 'ఆయన మిమ్మల్ని ఏమన్నాడో తెలుసా?' అని ఇంగ్లీషులో అడిగాడు. 'నాకు మళయాలం రాదు, తెలుగు వాడిని' అన్నాను. ఆయన నాకు కూడ తెలుగు వచ్చు అని 'మీరు ఇంటికి వెళ్ళేటప్పుడు మీరు బ్యాగ్ పెట్టుకున్న స్థలం కూడ మీ వెంట ఇంటికి తీసుకు వెళ్తారా అన్నాడు' అని చెప్పాడు. 'నేను ఆ స్థలం దాచలేదే, ఊరకనే పెట్టాను, ఆయనను ఆ బ్యాగ్ తీసి కూర్చోవద్దన్నానా?' అన్నాను నేను. అయినా అలా రొప్పుతూ వెళ్ళకపోతే ఇక్కడ కూర్చోవచ్చు కదా అనుకొని ఆ వైపు తొంగి చూస్తే ఆయన ఆయన కుమార్తె కూర్చుని వున్నారు. నేను పెట్టె ఒళ్ళో పెట్టుకొని వ్రాసుకుంటూ కూర్చున్నాను.

అంతలో ఇందాక రొప్పుతూ పోయిన లావాటి వ్యక్తి సుడిగాలిగా వచ్చి నా ఎదురుగా కూర్చుని, నా రెండు చేతులు గట్టిగా పట్టుకొని మళయాలంలో ఏదో బ్రతిమిలాడుతున్నాడు. నాకు మళయాలం రాదు అన్నాను. వెంటనే ఇంగీషులో 'మీరు నన్ను క్షమించాలి' అన్నాడు. 'ఎందుకు, మీరేం చేశారు' అన్నాను. 'దేవుడు చేసిన కార్యములను నా బుద్ధిహీనత వలన మిమ్ములను కష్టమైన మాటలన్నాను' అన్నాడు. 'మీరు

క్రైస్తవులా?' అన్నాను. 'ఔను, ప్రభువు బిడ్డను ఆయన నన్ను నడిపిస్తుంటే అది ఎరుగలేదు. నేను నా బిడ్డతో బయలుదేరే టప్పుడు రైలు వస్తూ వుంది. అందువల్ల రైలు కొరకు పరుగెత్తాను. నాకు బి.పి. వుంది. అవతల కంపార్టుమెంటులో ఎక్కాను. కాని నా బిడ్డ ఈ కంపార్టుమెంటులోకి వెళ్దాము అంది. ఇక్కడ మీరు మీ సామాను కూర్చునే చోట పెట్టారు. అప్పుడు నేను, వెళ్ళేటప్పుడు సామాను పెట్టిన స్థలాన్ని మీ వెంట తీసుకెళ్తారా? అంటూ వెళ్ళాను' అన్నాడు.

'ఆ సామాను నాదని మీకెలా తెలుసు?' అన్నాను 'నేను రైలు కోసం పరుగెత్తేటప్పుడు ఈ బ్లూ సంచీ మీచేతిలో చూశాను. నా బాష మీకు అర్థంకాకపోయినా, దేవుడు విన్నాడు కదా!' అన్నాడు. 'నేను క్రైస్తవుడనని మీకు తెలుసా? నేను పెట్టుకున్న బ్యాడ్జీ చూశారా?' అని అడిగాను. 'ఇప్పటి వరకు నేను ఆ బ్యాడ్జి చూడలేదు. మీరు క్రైస్తవులా? ప్రభువు బిడ్డలా?' అని మరలా నా చేతులు పట్టుకుని 'నేను మిమ్మల్ని అలా మాట్లాడి అవతలకి వెళ్ళి కూర్చున్నాను. మా ఎదురుగా ఇద్దరు స్త్రీలు కూర్చున్నారు. దేవుడు వారితో మాట్లాడమని చెప్తున్నా కూడా నేను గంటదాక వారితో మాట్లాడలేదు. చివరికి మాట్లాడాను. వారిలో ఒకామె కేన్సర్ వ్యాధిగ్రస్తురాలు. మరణావస్థలో వున్నదని తెలుసుకున్నాను. వారికి యేసును గురించి ఒక గంట చెప్పాను. వారిద్దరూ ప్రభువును అంగీకరించారు. వారి కొరకు ప్రార్థించాను. ప్రభువు ఆమె కేన్సర్ వ్యాధిని బాగు చేసినట్లు నాకు చెప్పాడు. వారి కొరకు ఈ రోజు ఈ బండిలోకి నన్ను ప్రభువు తీసికొని వస్తే నేను మిమ్మల్ని బాధపరచాను. ఒకవేళ నా మాటలు మీకు అర్థం కాకపోయినా, నా చూపైనా మిమ్మల్ని బాధించింది కదా!' అని బాధపడ్డాడు.

అప్పుడు నేను, ఆయన ఒకరి గురించిన వివరములు ఒకరము తెలుసుకున్నాము. అప్పుడు ఆయన 'నేను రైలు దిగిన తర్వాత బస్‌లో మరలా వెనక్కి ఒక గంట ప్రయాణం చెయ్యాలి. ఈ రైలు మా ఊరిలో ఆగదు, ఆగితే మిమ్మల్ని మా యింటికి తీసుకొని వెళ్ళేవాడిని. మనకిష్టంలేనివి జరిగినప్పుడు అది సైతాను చేశాడనుకుంటాము. కాని సైతానుకు ప్రభువు బిడ్డల మీద ఎలాంటి అధికారము లేదు. మీరు సీటు మీద ఆ బ్యాగ్ పెట్టకుంటే నేను అవతల కూర్చుని వారికి వాక్యము చెప్పేవాడిని కాదు, అప్పుడు వారికి స్వస్థత జరిగేది కాదు. ప్రభువు చిత్తము నెరవేరేది కాదుగదా!' అన్నాడు.

నా పత్రిక, క్యాలెండరు ఆయనకు ఇచ్చి, 'మార్చి నెల హన్నాకృపలో మా పాఠకులు ఇది చదువుతారు. మీ లోతైన విశ్వాసం, ప్రార్థన చేసుకునే వారి హృదయం ఎలా వుండాలో తెలుసుకుంటారు' అని చెప్పాను. అలా ఈ ప్రయాణంలో దేవుడు ఒక గొప్ప వ్యక్తిని కలుసుకొనే అవకాశం కల్పించినందుకు దేవునికి స్తోత్రములు.

---

(19వ పేజీ తరువాయి....)

చేసుకోలేదు, బైబిలు చదువుకోలేదు. కిటికిలో నుండి కనబడే బయట ప్రపంచాన్ని చూస్తూ మూడు నెలలు గడిపాను.

ఒకరోజు రాత్రి నాకు కలవచ్చింది. ఆ కలలో నేను మద్రాసులోని ఆ మందిరములో అందరూ చందా వెయ్యటానికి పాట పాడుకుంటూ వెళ్తుంటే నేను కూడా పాట పాడుకుంటూ వరుసలో నడుస్తూ వెళ్లి కానుక వేస్తున్నట్లు చూశాను. ఆ పగలంతా ఆ కల గుర్తుకు రాలేదు. ప్రతిరోజూ రాత్రి ఎనిమిది గంటలకు బెడ్‌పాన్ బేసిన్ మీద కూర్చుంటాను. అలానే ఆ రోజు కూడా కూర్చున్నాను. కుడికాలు గిలక నెప్పి పుట్టలేదు. వెంటనే కుడికాలు మీద బరువు మోపాను. గిలక అస్సలు నెప్పి పుట్టలేదు. వెంటనే రాత్రి వచ్చిన కల గుర్తుకొచ్చింది.

నువ్వు నాకు నీ కాలు విషయం ప్రార్థించక పోయినా మద్రాసులోని నా మందిరములో నా బిడ్డలు నీ కాలు కొరకు ప్రార్థిస్తున్నందు వలన నీ కాలు నేను బాగుచేసాను. ఇది కల ద్వారా నీకు చూపించాను అని దేవుడు నాతో చెప్పినట్లు అనిపించింది. మూడు సం॥లు ఎంతోమంది వైద్యులు బాగు చెయ్యలేని పాదము చివరికి విసుకుపుట్టి గిలక వరకు తీయించేసు కోవాలనుకున్న పాదము ప్రభువు తన బిడ్డల ప్రార్థన విని నాకు స్వస్థత కలుగజేశాడు. కుడికాలు జబ్బు వలన పాదము ఎదగనందున ఎడమకాలుకంటే కుడికాలు అంగుళం ఎత్తు తక్కువ. దేవుని ఉచిత కృప తన బిడ్డల ప్రార్థనకు ఆయన ఇచ్చే విలువకు నిదర్శనంగా నిలిచింది.

తర్వాత ఎ.బి.యం. హెడ్‌మాస్టరుగారైన డా॥ పి. రవివర్మ గారి దయతో స్కూలుకు వెళ్ళని సంవత్సరాలు మినహాయించి ఎస్.ఎస్.ఎల్.సిలో 1957లో చేర్చుకున్నారు. ఆ సంవత్సరం పాసైనపుడు మిషన్ హాస్పిటల్ డాక్టర్ బ్రేష్టడ్‌గారు గుంటూరు బాప్టిస్టు స్టూడెంట్స్ సెంటర్ కేరి హాలులో భోజన వసతి కల్పించారు. స్వర్గీయ డా॥ బి.వి.యల్. నారాయణగారు ఎ.సి.కాలేజిలో చేరటానికి సహాయపడ్డారు. ఒంగోలు సి.యస్.ఆర్. శర్మాకాలేజిలో ఫస్ట్‌బ్యాచ్ డిగ్రీ హోల్డర్స్‌లో ఒకనిగా నిలిచాను. స్వదేశంలో అన్నీ ప్రాంతాలు, విదేశీ పర్యటన చేశాను. రచయిత 'కొడవటికంటి'గా నా 67వ సంవత్సరములో నా సాక్ష్యము వ్రాయటం ఇది 'ప్రభువు కృప' వలననే కదా!



**ORTH AST EST OUTH**

# కర్నాటకలో క్రైస్తవులపై దాడి

ఫిబ్రవరి 3, కర్నాటక : కర్నాటక రాష్ట్రంలోని హోసదుర్గా జిల్లా కుంబరహళ్ళి గ్రామంలోని షాలోమ్ ఫుల్‌గాస్పెల్ చర్చ్‌పై సుమారు 25 నుండి 30 మంది హిందూ మతోన్మాద సాయుధ దుండగులు దాడిచేశారు.

షాలోమ్ చర్చ్ పాస్టర్ ప్రియదర్షన్ (36) కథనం ప్రకారం ఆదివారం ఉదయం ఆరాధన జరిగే సమయంలో సుమారు 25–30 మంది సాయుధ తీవ్రవాదులు (భజరంగదళ్) మతోన్మాద జండాలతో మోటార్ సైకిళ్ళపై వచ్చి చర్చిని చుట్టుముట్టి దాడి చేశారు. వీరికి గురుస్వామి అనే అతను నాయకత్వం వహించాడు. దుండగులు కత్తులు, కర్రలు, తల్వార్ ఇతర మారణాయుధా లను ధరించి దాడిచేశారు. ఈ దాడిలో కల్లేష్, కృపాకరణ్, అంజనప్ప అనే వారికి తీవ్రగాయాలయ్యాయి. పాస్టర్ ప్రియదర్షన్‌ను సుమారు రెండు కి.మీ. దూరంలోవున్న పోలీస్‌స్టేషన్ వరకు ఈడ్చుకుంటూ తీసుకెళ్ళారు. సాయుధ దుండగులు మతమార్పిడి చేస్తున్నాడంటూ క్రైస్తవులపై కేసు నమోదు చేశారు.

క్రైస్తవ నాయకులు ఎస్.పి. శ్రీ నాగప్పను కలిసి సహాయం కోరారు. గాయపడిన విశ్వాసులను హోసదుర్గా హాస్పిటల్లో చేర్పించారు. సాయంత్రం ఏడు గంటల ప్రాంతంలో పాస్టర్‌ను విడుదల చేశారు.

# ఛత్తీస్‌ఘడ్‌లో క్రైస్తవులపై దాడి

గురూర్, ఫిబ్రవరి 16 : ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలోని, దుర్గ్‌జిల్లా గురూర్ ప్రాంతంలో క్రైస్తవులు వున్న ఒక సమావేశంపై హిందూ తీవ్రవాదులు దాడిచేశారు. ఈ దాడిలో 80–100 మందికి తీవ్రగాయాలయ్యాయి. దుర్గ్ జిల్లాలోని గురూర్ ప్రాంతంలోని ఖోత్‌లీ గ్రౌండ్స్‌లో స్థానికుల కోసం పాస్టర్ మోహన్ కుజ్జూర్ థామస్ స్వస్థత కూడికలు ఏర్పాటు చేశాడు. కూడిక జరుగుచున్న సమయంలో ధర్మసేన అనే పేరుగల హిందూ మతోన్మాద సంస్థ సభ్యులు నాలుగు లారీలలో వచ్చి కూడికపై ఒక్కసారిగా దాడి చేశారు. ఈ దాడిలో థామస్‌తో సహా అనేకమందికి తీవ్రగాయాలయ్యాయి.

ఈ దాడిపై స్పందించిన గురూర్ పోలీస్‌స్టేషన్ ఎస్.ఐ. డి.యస్.బిహారి దాడిలో పాల్గొన్న వారిలో హనుమాన్ భక్తుడిని ఒకరిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించారు. మిగతా వారికోసం అన్వేషిస్తున్నట్లు త్వరలోనే మిగిలిన వారిని అరెస్ట్ చేస్తామని హామీ ఇచ్చారు. ఛత్తీస్‌ఘడ్ ప్రక్క రాష్ట్రమైన ఒరిస్సాలో డిసెంబర్ 24, 2007 నుండి జనవరి 2008 వరకు జరిగిన సీరియల్ దాడులకు అనుగుణంగా ఇది జరిగినట్లు క్రైస్తవులు భావిస్తున్నారు.

# క్రైస్తవ ఉద్యోగినిపై మతమార్పిడి కేసు

ఇబ్రహీంపట్నం, డిసెంబర్ 18 : కరీంనగర్ జిల్లా, ఇబ్రహీంపట్నంలో జడ్.పి.ఎస్ పాఠశాలలో రికార్డ్ అసిస్టెంట్ ఉద్యోగం చేస్తున్న క్రైస్తవ ఉద్యోగిని రత్నకుమారి మతమార్పిడి చేస్తుందంటూ గ్రామంలోని గజ్జ రాజన్న అనే వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే రత్నకుమారి జీవిత విధానానికి ఆకర్షితులైన కొంతమంది అటువంటి మంచి జీవితం జీవించాలని ఆమె దగ్గరకు సలహాలకు ప్రార్ధనకు వస్తుండేవారు. అదే క్రమంలో అదే స్కూల్లో పదవ తరగతి చదువుతున్న గజ్జ రాజశేఖర్ విద్యార్ధి తనకున్న సమస్యల పరిష్కారం కొరకు ప్రార్ధన కొరకు రత్నకుమారి దగ్గరకు వెళ్ళాడు. దీనిని జీర్ణించుకోలేని క్రైస్తవ వ్యతిరేక శక్తులు రత్నకుమారి మతమార్పిడులు చేస్తుందంటూ పోలీస్ స్టేషన్‌లో అక్రమ కేసు బనాయించారు. అంతటితో ఆగని గ్రామస్తులు క్రైస్తవ వ్యతిరేక శక్తుల ప్రోద్భలంతో ఆమె యింటి మీదకు వెళ్ళి గొడవ చేశారు.